10 YEAR ANNIVERSARY 2014 - 2024
పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం। మన్యం। విజయనగరం। విశాఖపట్నం । అనకాపల్లి। అల్లూరి జిల్లా

### ప్రకృతి విలయతాండవం...

# మాదిగ మల్లు గ్రామంలో గృహాలు కనుమరుగు

ప్రభుత్వం ఆదుకోవాలని గృహాలు కోల్పోయిన అభాగ్యుల ఆవేదన







**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, సెప్టెంబర్ 9**

అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలంలో ఆదివారం రాత్రి వరుణుడు కన్నెర్ర చేశాడు. అభం శుభం తెలియని అమాయక గిరిజనులపై ప్రకృతి కన్నెర్ర చేయటంతో దిక్కుతోచని స్థితిలో గిరిజనులు అల్లాడుతున్నారు. గుమ్మిరేగుల పంచాయతీ మాదిగ మల్లు గ్రామంలో పడాల మంజులత (భర్త పేరు గురుమూర్తి), జనం మైన( భర్త పేరు ధనుర్జాయ్ )ల గృహాలు ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి వాగు పొంగి ప్రవహించి ఒక్కసారిగా వారు నివసిస్తున్న గృహాల పైకి రావడంతో గృహాలు వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. వారు కట్టు బట్టలతో మాత్రమే బ్రతుకు జీవుడా అంటూ బయటపడ్డారు. గృహాలు నామరూపాలు లేకుండా కొట్టుకొని పోయాయి. వారికి నిలువ నీడ లేదు, కనీసం వంట పాత్రలు కూడా లేకుండా కొట్టుకొని పోయాయి. అలాగే అదే పంచాయితీకి చెందిన అన్నవరం గ్రామంలో కిముడు మత్యరాజు,కొల్లో తన్ని యొక్క గృహాలు వర్షానికి స్థానికంగా ఉండే వాగు పొంగటంతో వరద ఉధృతికి వారి యొక్క గృహాలు నేలమట్టం అయ్యాయి. కావున అధికారులు స్పందించి మాదిగ మల్లు గ్రామంలో సర్వం కోల్పోయిన కుటుంబాలను ఆదుకోవాలని, అలాగే అన్నవరం గ్రామంలో గృహాలు ధ్వంశమైన వారిని కూడా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఈ సందర్భంగా స్థానిక గ్రామ పెద్ద జోరంగి వెంకటరమణ మాట్లాడుతూ మాదిగ మల్లు గ్రామంలో కట్టుబట్టలతో ఉన్న కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు సర్వస్వాన్ని కోల్పోయారని ప్రభుత్వం వీలైనంత త్వరగా వారికి సహాయం చేయాలని కోరారు.

### నత్తనడకన హై వే రోడ్డు నిర్మాణం

# పూర్తిగా ప్రభుత్వ వైఫల్యం

**కాంట్రాక్ట్ ర్ నిర్లక్ష్యం పై**
**నేను సైతం ట్రస్ట్ చైర్మన్ శివప్రసాద్ మండిపాటు.**
**ఇంకా ఎంతమంది ప్రాణాలు బలిగోంటారని ధ్వజం.**

**కొయ్యూరు,పెన్ పవర్ సెప్టెంబర్ 9**

ప్రజల ప్రయోజనాలు, సౌకర్యంగా ఉండేందుకు నిర్మించే హై వే రోడ్డు నిర్మాణం లో నిర్లక్ష్యంతో ఉండటమే కాక నిత్యం ప్రయాణాలు సాగించే రూట్ల లో రాకపోకలకు అంతరాయం కలుగజేయటం పట్ల నేను సైతం ట్రస్ట్ చైర్మన్ కే. శివప్రసాద్ మండిపడ్డారు. నిత్యం రద్దీగా ఉండే శరభన్నపాలెం, చింతపల్లి ప్రధాన రూట్ల లో బ్రిటిష్ నాటి బ్రిడ్జిలను తొలగించి వేరే వంతెనలు నిర్మించే క్రమంలో రోడ్డు డైవర్సన్ ఏర్పాటు లో హై వే కాంట్రాక్ట్ ర్ల నిర్లక్ష్యం కారణం గా ఇప్పటికే రామరాజుపాలెం, పి. మాకవరం గ్రామాల వద్ద నిర్మించే నూతన వంతెనల కు ఇచ్చిన రోడ్డు డైవర్సన్ కొట్టుకుపోయి ఒక యువకుడు గెడ్డలో కొట్టుకుపోయి నేపథ్యంలో ఆయా వంతెన ల నిర్మాణాల వద్ద రాకపోకలకు అంతరాయం కలగకుండా వేసే డైవర్సన్ రోడ్డు లోప భూయిష్టం గా ఉండటం తో తరుచూ కొట్టుకుపోవటం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా ఇటు కాంట్రాక్ట్ ర్ కానీ, ప్రభుత్వ అధికారులు కానీ ఏ మాత్రం రక్షణ ఏర్పాట్లు కల్పించక పోవటం పట్ల ఆయన తీవ్ర స్థాయి లో ఈ ప్రభుత్వం తీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో ఈ డైవర్సన్ రోడ్ల వద్ద కూడా ఏ విధమైన రక్షణ చర్యలు కల్పించక పోవటంతోనే ఒక యువకుడు మరణించిన సంభంధిత కాంట్రాక్టర్లు, అధికారులు ఎవరు పట్టించోకోపోవటం పై శివప్రసాద్ ప్రభుత్వం వైఫల్యమేనని ఆరోపించారు. డైవర్సన్ కొట్టుకుపోవటంతో రాకపోకలు లేక కృషదేవిపేట, అపై పట్టణ ప్రాంతాలకు వెళ్లి వైద్యం పొందే వారు,నిత్యావసర సరుకులు తెచ్చుకునే గిరిజనులు ఎటు వెళ్ళాలేక రెండు రోజులుగా తీవ్ర ఇబ్బంది పడుతున్నారని అందోళన వ్యక్తం చేశారు. బాలింతలు, గర్భిణీలు ఏంతో ఇబ్బంది పడుతున్న పరిస్థితులు ఈ హైవే రోడ్డు పక్క డైవర్సన్ పోవటంతో ప్రమాదాలకు గురువుతున్నట్టు తెలిపారు. ఈ హైవే కాంట్రాక్ట్ ర్ కూడా వీటిపై అనేక దఫాలు పిర్యాదు చేసిన పట్టించుకోలేక పోవటం పట్ల శివప్రసాద్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంకా ఎంతమంది ప్రాణాలను బలిగోంటరాని ప్రశ్నిస్తున్నారు.పాత (బ్రిటిష్ కాలం నాటి )బ్రిడ్జి లను తొలగించకుండా, కొత్త వంతెనలు నిర్మించాలని ఈ ప్రాంత ప్రజలంతా విజ్ఞప్తి చేసినా స్పందించకుండా కాంట్రాక్టు నిర్వాహకం తోనే ఈ వర్షాకాలం లో ఇబ్బంది ఎదురవుతున్నట్టు ఆయన తెలిపారు. తక్షణమే డైవర్సన్ రోడ్డు తోపాటు, ఆయా అసంపూర్తి గా నిర్మించే వంతెనలు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజల ఇబ్బంది తొలగించాలని అధికార్లు, కాంట్రాక్టుర్లు ను కోరుతున్నారు. ఈ రోడ్డు పరిశీలించిన వారిలో నడింపాలెం వార్డు సభ్యులు శ్యాముల్,పలు గ్రామాల గిరిజనపెద్దలు పాల్గొన్నారు.



### జోలాపుట్టు, డుడుమ జలాశయాలకు

# ప్రమాదకర స్థాయిలో నీటి మట్టం

**దిగువన నున్న డుడుమకు 49వేల క్యూసెక్కుల నీరు విడుదల**
**మాచ్ ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో రెండో జనరేటర్లో ప్రవేశించిన నీరు**
**పరివాహక గ్రామాల ప్రజలకు అప్రమత్తం చేసిన ప్రాజెక్టు సిబ్బంది**
**భయాందోళనలో జోలాపుట్టు రిజర్వాయర్ పరివాహక గ్రామాల ప్రజలు**





**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబర్ 09**

ఆంధ్ర – ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్ ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి నీరందించే జోలాపుట్టు ప్రధాన జలాశయం నీటి మట్టం సోమవారం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ఆంధ్ర ఒడిస్సా సరిహద్దులో గత కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జలాశయంలోకి వరద నీరు భారీగా పోటెత్తడంతో జలాశయ నీటి మట్టం పెరిగింది. జోలాపుట్టు జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 2750 అడుగులు కాగా సోమవారం సాయంత్రం 4 గంటల 30నిమిషాల సమయానికి 2749.35 అడుగులుగా నమోదయింది. దీంతో అప్రమత్తం అయిన జోలాపుట్టు జలాశలయ సిబ్బంది 8 గేట్లు ఎత్తి 49వేల క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న డుడుమ జలాశయానికి విడుదల చేస్తున్నారు. 8గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తుండటంతో ఆంధ్ర, ఒడిస్సా సరిహద్దులో ప్రధాన డ్యామ్ కింద వైపున ఉన్న స్పిల్ వే వంతెనపై వరద నీరు ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో ఆంధ్ర,ఒడిస్సా ప్రాంతాల రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. అలాగే జోలాపుట్టు జలాశయానికి దిగువన ఉన్న డుడుమ జలాశయంలో సైతం నీటి సామర్థ్యం అధికమవడంతో డుడుమ జలాశయ సిబ్బంది తగినంత గేట్లు ఎత్తి దిగువన ఉన్న మాచ్ ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో పరివాహక గ్రామాల గిరిజనులు ఏ సమయంలో ఏమి జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆంధ్ర- ఒడిశాల ఉమ్మడి నిర్వహణలో ఉన్న మాచ్ ఖండ్ జల విద్యుత్ కేంద్రంలోకి వరద నీరు ప్రవేశించింది. మూడ్రోజులుగా కురుస్తున్న వానలతో జోలాపుట్ డ్యాం నుంచి 49వేల క్యూసెక్కులు, డుడుమా జలాశయం నుంచి 20వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో విద్యుత్ కేంద్రంలోని రెండో జనరేటర్లలోకి నీరు ప్రవేశించింది. జనరేటర్ వద్ద నిలిచిన నీటిని పంపుల సాయంతో ఇంజినీర్లు బయటకు తోడుతున్నారు. ఇక ముందు వరద నీరు ప్రవేశించకుండా ఇసుక బస్తాలను అడ్డుగా వేస్తున్నారు. అయినా పరిస్థితిలో ఎటువంటి మార్పు రాకపోతే విద్యుత్ ఉత్పత్తి నిలిపివేస్తామని అధికారులు తెలిపారు. ప్రస్తుతం నాలుగో జనరేటర్ వద్ద ప్రతీ గంటకు 80 మెగావాట్లు ఉత్పత్తి చేస్తున్నారు. ఆధునికీకరణ నేపథ్యంలో... కొన్ని జనరేటర్లను నిలిపివేసి ఉండటం వల్ల భారీ నష్టం తప్పిందని అధికారులు తెలిపారు. జోలపుట్టు ఆనకట్ట క్రిందనున్న ప్రజలు కాలినడకన నడిచె బ్రిడ్జి పై నుండి నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. శనివారం చేపలు వేటకు వెళ్లి గెడ్డలు వదిలిన మత్స్యకారుల బోట్లు కొట్టుకుపోయాయని పలువురు మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. దిగువనసున్న బొంద్రుగూడ, మాకవరం, కుంబిరిపడ్డ, మేథ, సిందిపుట్టు, దోడిపుట్ సరిహద్దు గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

### అల్లూరి జిల్లా "చట్రాపల్లి" గ్రామంలో కొండ చరియలు

# విరిగిపడి ఒకరు మృతి!

**ముగ్గురికి తీవ్ర గాయాలు**
**మరికొంతమంది గల్లంతు?**







**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, సెప్టెంబర్ 9**

అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు గూడెం కొత్తవీధి మండలం గాలికొండ గ్రామపంచాయతీ పరిధిలోని చట్రాపల్లి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి కొండ చరియలు గ్రామంపై విరుచుకు పడడంతో ఒక మహిళ మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలు తగిలాయి.గత కొంతకాలంగా కురుస్తున్న భారీ వర్షాలకు తోడు ఆదివారం ఉదయం నుండి అల్లూరి జిల్లా గూడెం కొత్తవీధి మండలంలో కుంభవృష్టి వర్షం కురుస్తుంది. ఈ నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి ఒక్కసారిగా చట్రా పల్లి గ్రామం పై సమీప కొండల నుండి భారీ ఎత్తున నీరు,రాళ్లు దొర్లుకొని వచ్చి గ్రామంలో తీవ్ర భయానక వాతావరణంలో సృష్టించింది.ఒక్కసారిగా కొండచరియాలు విరిగిపడడంతో చట్రాపల్లి గ్రామంలో గిరిజనులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమీప కొండ నుండి నీరు బండరాళ్లు బురద మట్టి గ్రామం పై విరుచుకుపడడంతో గ్రామానికి చెందిన కొర్ర కుమారి (20) అనే మహిళ మృతి చెందగా ఆమెతోపాటు కొర్ర సుమిత్ర (18)కోర్ర సుబ్బారావు (25)కోర్ర పండన్న (60) కొండ చరియలు తాకిడికి కొట్టుకుపోయారు. అయితే సంఘటన జరిగిన వెంటనే స్పందించిన చట్రాపల్లి గ్రామస్తులు కొట్టుకుపోయిన ముగ్గురిని కాపాడగా ఒక మహిళ మాత్రం మృతి చెందింది. దీంతో ఈ విషయాన్ని అల్లూరి జిల్లా అధికారులకు సమాచారం అందించడంతో అధికార యంత్రాంగం ఆ ప్రాంతానికి బయలుదేరింది. అయితే ఎడతెరిపిలేని వర్షం కారణంగా సంఘటన ప్రాంతానికి బయలుదేరిన పాడేరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి అభిషేకు లంకపాకలు అనే గ్రామానికి వెళ్లి అక్కడ ప్రధాన రహదారికి చెందిన మూడు బ్రిడ్జిలు వర్షాల తాకిడికి కొట్టుకుపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో వెనక్కి తిరిగి వెళ్లే పరిస్థితి నెలకొంది.అయితే సప్పర్ల సచివాలయం లో అందుబాటులో ఉన్న అధికారులను సకాలంలో ఆ ప్రాంతంలో చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు.చట్రాపల్లి గ్రామస్తులను దగ్గరలోని సప్పర్ల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలకు తరలించాలని ఆదేశించారు.గాయపడిన వారిని సకాలంలో సప్పర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్య చికిత్సలు అందిస్తున్నారు అయితే ప్రస్తుతం వారిని బయట ప్రాంతాలకు తీసుకువెళ్లడానికి అన్ని ప్రాంతాల నుండి రహదారి మార్గాలు వర్షాల తాకిడికి మూసుకుపోవడంతో అక్కడే వైద్య సేవలు అందిస్తున్నారు.అల్లూరి జిల్లా గూడెం కొత్తవీధి మండలం గాలికొండ గ్రామపంచాయతీ చట్రాపల్లి గ్రామంలో కొండ చర్యలు విరిగిపడి మృతి చెందిన కుమారి కుటుంబానికి 5 లక్షల రూపాయల జాతీయ విపత్తు పథకం కింద ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామని అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. భారీగా వర్షాలు పడుతున్న నేపథ్యంలో కొండల సమీపంలో ఉన్న గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని వర్షాల తాకిడికి కొండ చర్యలు వీడికి పడే అవకాశం అధికంగా ఉందని సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని కలెక్టర్ దినేష్ కుమార్ కోరారు.




## నేషనల్ హైవే516
## డైవర్షన్ పనులు వేగంగా పూర్తి చేయండి
### ఐ టి డి ఏ పి ఓ వి అభిషేక్ ఆదేశం



**చింతపల్లి సెప్టెంబర్ 9పెన్ పవర్**

మండలంలోని లంబసింగి-చింతపల్లి గ్రామాల మధ్య మడిగుంట వద్ద నేషనల్ హైవే516 డైవర్షన్ రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోయిందని దాన్ని వెంటనే పునరుద్ధరించి రవాణా సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి .అభిషేక్ జాతీయ రహదారి అధికారులను ఆదేశించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కొట్టుకుపోయిన మడిగుంట డైవర్షన్ రోడ్డు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రాత్రికి (సోమవారం) రోడ్డు డైవర్షన్ పనులను పూర్తి చేసి మంగళవారం వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా తక్షణమే పనులు చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డివిఆర్ ఎం రాజు, డి ఈ చాణిక్యరావు, తదితరులు పాల్గొన్నారు.

## నష్టపోయిన పంట పొలాలు
## రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి
### మేజర్ పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత





**చింతపల్లి సెప్టెంబర్ 9 పెన్ పవర్**

చింతపల్లి పంచాయతీ మల్లవరం, గడపరాయి, కందుల గాది, చిలకలమామిడి తదితర గ్రామాలలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ముంపునకు గురైన పంట పొలాలను స్థానిక సర్పంచ్ దురియా పుష్ప లత ఆదేశాలకు మేరకు సచివాలయం – 2 అగ్రికల్చరల్ అసిస్టెంట్ చంద్రకళ, వీఆర్వో చిరంజీవి ముంపు ప్రదేశాలకు వెళ్లి పరిశీలించడం అయినది, ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి ముంపునకు గురి అయిన పొలాలకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ నాయకులు ముత్తా శ్రీను, గడపరాయి వార్డు మెంబర్ లింగ బాబు, కేశవరావు , సుబ్బారావు మత్స్యరాజు, మరియూ గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే భారీగా కురుస్తున్న వర్షాలకు కొండ చరియలు, వంతెనలు వంటివి విరిగిపడే అవకాశం ఉన్నది కావున కొండ దిగువ ప్రాంతంలో ఉన్నవాళ్లు వెంటనే ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, అలాగే ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలోకి దిగి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని వరద ఉధృతి తగ్గేంత వరకు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని ఆమె అన్నారు.

## నష్ట నివారణ చర్యలకు కృషి చేయాలి
### పిఓ అభిషేక్ ను కోరిన ఎంపీపీ కుమారి

**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 9**

అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గూడెం కొత్తవీధి మండలంలో తీవ్ర ప్రాణ ఆస్తి నష్టాలు సంభవించాయని, మండలంలో నష్ట నివారణ చర్యలకు ఉన్నతాధికారులు సహకరించాలని గూడెం కొత్త వీధి మండల ఎంపీపీ బోయిన కుమారి పాడేరు ఐటిడిఏ పిఓ అభిషేకును కోరారు. ఆదివారం అర్ధరాత్రి మండలంలో చట్రాపల్లి గ్రామంలో కొండ చరియలు విరిగిపడటం వలన ప్రజలు తీవ్రంగా నష్టపోయారని, ఆస్తి నష్టం ప్రాణ నష్టం సంభవించిందని వివరించారు. ఐటీడీఏ పీవో తో కలిసి ఎంపీపీ బోయిన కుమారి చాట్రా పల్లి గ్రామానికి వెళ్లడానికి ప్రయత్నం చేసిన సంపంగి గొంది గ్రామం దాటిన తర్వాత ఆంధ్ర ఒరిస్సా అంతరాష్ట్ర రహదారికి కల్వర్టులు కొట్టుకొని పోవటంతో సంఘటన స్థలానికి వెళ్లలేక పోయారు. ఈ సందర్భంగా ఎంపీపీ మండలంలో వివిధ ప్రాంతాలలో వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టులను తిరిగి నిర్మించాలని, జనజీవనం వేగంగా పునరుద్ధరించేల వేగవంతంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు కోల్పోయిన పంట ఆస్తి పశు నష్టాలను పరిశీలన చేసి నష్టపరిహారం అందించాలని కోరారు.



# బుంగాపుట్టు పంచాయతీలో వరదలకు కొట్టుకుపోయిన నాలుగు కల్వర్టులు

### రహదారి నిర్మాణంలో గుత్తేదారుని నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితులు –బుంగాపుట్టు నుండి పులిజలమ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలి
### కల్వర్టులు కొట్టుకుపోవడంతో స్తంభించిన జనజీవనం –బ్రిడ్జి నిర్మాణంతోపాటు రహదారి నిర్మాణం చేపట్టాలి
### –బుంగాపుట్టు పంచాయతీ సర్పంచ్ జర్రెలా నోబిన, ఉప సర్పంచ్ కొర్ర సీతారం








**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబర్ 09**

అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. వరద ప్రభావంతో గిరిజన ప్రాంతంలో కొండ చర్యలు విరిగిపడటమే కాక వాగులు వంకలు పొంగి గెడ్డలు ఉధృతంగాప్రవహిస్తున్నాయి. అల్లూరి జిల్లా, ముంచంగిపుట్టు మండలం మారుమూల బుంగాపుట్టు పంచాయతీలో వర్ష బీభత్సానికి వరదలకు ప్రధాన రహదారుల వద్ద ఉన్న 4 కల్వర్టులు కొట్టుకుపోయాయని, గుత్తేదారుని నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి నెలకొందని పంచాయతీ సర్పంచ్ జర్రెల నవీన, ఉప సర్పంచ్ కొర్ర సీతారాం తెలిపారు. వారు సోమవారం పాత్రికేయులతో మాట్లాడుతూ బుంగాపుట్టు పంచాయితీలో గల మజ్జిగూడా, బుంగాపుట్టు, కొట్యగూడ గ్రామాలలో గల ప్రధాన రహదారుల వద్ద ఉన్న కల్వర్టుల్లో వరద ఉధృతికి కొట్టుకుపోయాయని, దీంతో జనజీవనం పూర్తిగా స్తంభించి పోయిందన్నారు. గత డిసెంబర్ లో బుంగాపుట్టు నుండి పులిజలమ వరకు సుమారు 7 కోట్ల నిధులతో 5.5 కిలోమీటర్ల పిఆర్ రోడు నిర్మాణానికి శంకుస్థాపన చేశారని, గుత్తేదారుడు నిర్లక్ష్యం కారణంగానే రహదారి నిర్మాణ పనులు ఆగిపోయాయని, రహదారి నిర్మించి ఉంటే ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదన్నారు. ఈ విషయమై సదరు గుత్తేదారుని సంప్రదిస్తే పొంతన లేని సమాధానాలు చెబుతూ ఎంపీడీవోకు, పిఓకు, కలెక్టర్ కు మీదిక్కున చోట చెప్పుకొండని సమాధానం ఇస్తున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు రోజులుగా ఎడతెరిపిలేని కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లుతూ రహదారిలో నిర్మాణంలో ఉన్న కల్వర్టులు కొట్టుకు పోయిందని, దీంతో గ్రామాల మధ్య సంబంధాలు పూర్తిగా తెగ్గిపోయి జనజీవనం అస్తవ్యస్తమైందన్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టి ఉంటే ఈ పరిస్థితి దాపరించేది కాదన్నారు. కొత్తగ్రరం గ్రామంలోను వరదలకు కల్వర్టు కొట్టుకుపోవడం వల్ల ప్రజలకు నిత్యవసర సరుకులు సైతం దొరకని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొట్టుకుపోయిన కల్వర్టుల స్థానంలో బ్రిడ్జిల నిర్మాణం చేపట్టి, రహదారి నిర్మాణం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బుంగాపుట్టు పంచాయితీ వార్డు మెంబర్లు కొర్ర గోపాల్, కొర్ర మహేశ్వరరావు, గ్రామస్తులు జర్రెల సుబ్బారావు, కిల్లో కృష్ణారావు, కొర్ర మొద్దు, కిల్లో ధనుర్జయ్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు పక్కా ఓటరు జాబితా తయారు
### జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్





**స్టాప్ రిపోర్టర్,పాడేరు,గూడెం కొత్తవీధి,పెన్ పవర్,సెప్టెంబరు 9**

స్థానిక సంస్థల ఎన్నికలలోపు పక్కా ఓటరు జాబితా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ స్పష్టం చేసారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులు,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా తయారీపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కచ్చితమై జాబితా తయారు చేయడానికి రాజకీయ పార్టీలు సహకరించాలని అన్నారు. ఇంటింటికి వెళ్లి ఓటరు నమోదు ప్రక్రియకు వెళ్లినపుడు 1686 మంది అందుబాటులో లేరని, 390 మంది తరలి వెళ్లారని,1387 మంది మృతి చెందారని చెప్పారు.577 మంది ఓటర్లకు ఫోటోలు సక్రమంగా లేవన్నారు.వాటిని సవరిస్తామని చెప్పారు. డూప్లికేట్ ఓటర్లు,మృతి చెందిన ఓటర్లను ఓటరు జాబితా నుండి తొలగిస్తామన్నారు.మూడు నియోజక వర్గాలలో 2424 మందికి ఒకే విధమైన ఫోటోలు ఉన్నాయని అన్నారు.ఓటరు నమోదుపై బూత్ స్థాయి అధికారులకు ఓటరు నమోదుపై శిక్షణ అందిస్తామన్నారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.ఎం.జె.అభిషేక్ గౌడ్,డి.ఆర్.ఓ.బి.పద్మావతి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## డాబాగూడలో పోడు పట్టాలు పంపిణి చేయాలి
### సుంకర మెట్ట సర్పంచ్. చిన్నబాబు



**అరకులోయ పెన్ పవర్ 9**

అరకులోయ మండలం దాబుగుడా గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ళు మంజూరు చేయాలని, ఇప్పటి వరకు డబ్బులు అకౌంట్ లో పడని వారికీ తక్షణమే బిల్లులు చెల్లించాలని,ప్రస్తుతం పీఎం – జన్మన్ కింద ఒక ఇళ్ళు నిర్మాణానికి ఇస్తున్న 2లక్ష ల 39 వేయిలు గిరిజన ప్రాంతంలో ఇల్లు నిర్మాణానికి ఏ మూలకి సరిపోవునని,ఒక్కో ఇల్లు నిర్మాణానికి 5 లక్షలకు పెంచాలని సుంకరమెట్ట సర్పంచ్ ఎమ్మెల్యే చిన్నబాబుడిమాండ్ చేశారు. పీఎం –జన్మన్ హౌసింగ్ సర్వేలో సాంకేతిక కారణాలు వలన రిజెక్ట్ అయిన పేర్లును అరులుగ గుర్తించి ఇల్లు మంజూరు చేయాలని,మండల వ్యాప్తంగా పి.టీ.జి గ్రామాల్లో మౌలిక సదుపాయాలు లేవుని,పీఎం–జన్మన్ పథకం కింద ప్రతి గిరిజన గ్రామానికి సీసీ రోడ్డు డ్రైనేజీ కొత్త విద్యుత్ స్తంబాలు ఏర్పాటు చేయాలి.పీఎం –జన్మన్ యోజనలో భాగంగా సుంకర మెట్ట పంచాయతీలో 98 పి.వి.టి. జి కుటుంబాలకు సర్వే చేసిన రైతులకు పోడు భూమి పట్టాలు పంపిణి చేయాలని, మండలంలో పీఎం –జన్మన్ యోజనలో పోడు భూమి పట్టాల కోసం సర్వే చేసిన అందరికి పోడు భూమి పట్టాలు పంపిణి చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని, లేనియెడల రైతులతో కలిసి ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మండల తహశిల్దార్ కార్యాలయంలో ఆందోళన చేస్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోగ్రామస్తులు ఆనంద్ రావు, ప్రేమ్ కుమార్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

### చట్రాపల్లి ఘటనలో మృతి చెందిన కొర్ర కుమారి
## కుటుంబానికి ఐదు లక్షలు నష్టపరిహారం
### ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, సెప్టెంబర్ 9**

అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం గాలికొండ పంచాయితీ చట్రాపల్లి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి కొండచరియాలు విరిగిపడి కొర్ర కుమారి(18)మృతి చెందింది. ఈ సంఘటనలో మరి కొంతమంది తీవ్రంగా గాయపడ్డారు మృతి చెందిన కొర్ర కుమారి కుటుంబానికి జాతీయ విపత్తు సంస్థ నిబంధనల ప్రకారం 5 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా జిల్లా కలెక్టర్ ప్రకటించడం జరిగిందని స్థానిక ఎంపీడీవో ఉమామహేశ్వరరావు మీడియాకు తెలిపారు. మరో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారని, గాయపడ్డ కోర్రపండన్నా(60),కొర్ర సుమిత్ర(18), కొర్ర సుబ్బారావు(25)లను సప్పర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స అందించటం జరుగుతుందని వివరించారు.



### నష్టపోయిన రైతులను గుర్తించి
## నష్టపరిహారం అందించాలి
### అధికారులు పారదర్శకతతో పనిచేయాలి
### మండల జనసేన పార్టీ అధ్యక్షుడు కొయ్యం బాలరాజు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, సెప్టెంబర్ 9**

అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం లో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరీ పంటపొలాలు తీవ్రంగా నష్టపోయారని మండలం జనసేన పార్టీ అధ్యక్షులు కొయ్యం బాలరాజు తెలిపారు. స్థానిక రింతాడ పంచాయితీలో గల కొర్రపల్లి,మర్రిపాలెం, పనసలొద్ది గ్రామాలను సందర్శించి అక్కడ రైతులతో క్షేత్రస్థాయి పర్యటన చేశారు.ప్రభుత్వం ప్రకటన చేసినట్టుగా గిరిజన రైతులకు నష్ట పరిహారం చెల్లింపు విషయమై అధికారుల బృందం తో పర్యటిస్తూ నివేదిక ఆధారంగా జరిగిన నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లించాలని కోరారు.గిరిజన రైతులు వరి సాగుచేసే విధానం విలక్షణంగా వుంటుందని వాణిజ్యపరమైన ఆలోచనతో సాగు చేపట్టే ఆలోచన గిరిజన రైతులకు వుండదని, కేవలం సంవత్సరానికి కుటుంబం తిండి అవసరాలకు తగినంతలో సాగు చేస్తారని స్థానిక వ్యవసాయ విధానం వారి సహజ మనుగడకు ఒక గొప్ప సంబంధాన్ని కలిగవుంటుందన్నారు. ఇటువంటి బారి వర్షాలకు దెబ్బతిన్న పంటలను అధికారులు పరిశీలించి నష్టపరిహారం చెల్లిస్తారనే విషయం కూడా తెలియని గిరిజన రైతులున్నారని,గతంలో హుద్ హూద్,లైలా వంటి తుపాన్ కారణంగా అప్పట్లో నష్టపోయిన గిరిజన రైతులకు పంటనష్టం పరిహారం చెల్లింపు విషయంలో అప్పటి తుపాన్లు చేసిన నష్టం కంటే అప్పటి అధికార యంత్రాంగం చేసిన నష్టమే ఎక్కువన్నారు.ఈ సారైన నష్టపోయిన గిరిజన రైతులకు,కొండచరియలు విరిగిపడి గృహ సముదాయాలు కోల్పోయి మరణించిన వారికి కూడా సత్వర న్యాయం చేయాలని అధికారులకు కోరుతున్నామన్నారు.ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా జరిగిన నష్టాన్ని దృష్టిలో పెట్టుకొని గూడెం మండలం లో అత్యధిక నష్టం జరిగిందనే విషయాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి,పంచాయితీ రాజ్ శాఖ మంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ కు కూడా తమవంతుగా లేఖ ద్వారా జరిగిన నష్టం తీవ్రత తెలియజేశమన్నారు.



కేంద్రకారాగారం,
విశాఖపట్నం.

**పత్రికా ప్రకటన**

ఇందు మూలంగా యావన్మంది వేలం పాటదారులకు తెలియజేయనది ఏమనగా ఈ దిగువ పేర్కొన్న వివిధ రకముల కు చెందినా సివిల్ స్టోర్ కు అన్ సర్వీస్ బుల్ వస్తువుల. Iron Scraps మరియు అన్ సర్వీస్ బుల్ మహీంద్రా వాహనము కు శ్రీ యుత పర్యవేక్షణాదికారి ,కేంద్రకారాగారం. విశాఖపట్నం వారు శ్రీయుత జైళ్ళ ఉప శాఖధికారి(కోస్తా ఆంధ్రాప్రాంతం ) రాజమహేంద్రవరం వారి సమక్షం లో తేది -: 09.09.2024 సోమవారం మధ్యాహ్నం 02.00 గంటలకు వేలం జరుపబడును.

| SL.NO. | DESCRIPTION OF THE ARTICLES | NO OF ITEAMS | EMD Amount |
|---|---|---|---|
| 1 | Colour TV's | 10 no's | Rs. 6000-00 (Rupees six thousand only) |
| 2 | Computers | 11 no's | |
| 3 | Godrej 7 lever locks | 83 no's | |
| 4 | Godrej 8 lever locks | 09 no's | |
| 5 | S.S Boganas 40kgs | 04 no's | |
| 6 | S.S Boganas 50kgs | 08 no's | |
| 7 | Hot box 50 Ltrs | 03 no's | |
| 8 | Hot box 30 Ltrs | 01 no | |
| 9 | S.S Tea jars 7.5 Ltrs | 14 no's | |
| 10 | S.S Tea jars 10 Ltrs | 07 no's | |
| 11 | S.S Tea jars 20 Ltrs | 07 no's | |
| 12 | S.S Tea jars 15Ltrs | 06 no's | |
| 13 | Xerox machine | 01 no | |
| 14 | Mahindra Vehicle (Bearing No AP31TT5546) | 01 No's | Rs. 3000-00 (Rupees three thousand only) |
| 15 | Iron Scraps | 2776 Kgs | Rs. 2000-00 (Rupees two thousand only) |

వేలం పాటలో పాల్గొనిన వారు పైన తెలిపిన ధరావత్తు లను చెల్లించవలెను. సదరు వేలం పాటలో నెగ్గని పాటదారులకు ధరావత్తు సొమ్ము వెంటనే వాపసు ఇవ్వబడును . పాటలో నెగ్గిన పాటదారుడు 18% శాతం G.S.T పన్నుతో సహా ఒక దాపాగా డబ్బును చెల్లించి పైన పేర్కొనబడిన అన్ సర్వీస్ బుల్ వస్తువులను తీసుకొని వెళ్ళవలెను .అలా చేయ్యని ఎడల ధరావత్తు సొమ్ము ప్రభుత్వ ఖజానాకు జమ చెయ్యబడును.

ఈ వేలం పాటను ఆమోదించుటకు గాను నిరాకరించుటకు గాను శ్రీ యుత పర్యవేక్షణదికారి . కేంద్రకారాగారం. విశాఖపట్నం వారికి అధికారం కలదు .మరన్ని వివరముల కొరకు ఈ క్రింది నెంబర్ ను సంప్రదించగలరు.

జైలర్:9490442272

పర్యవేక్షణాధికారి.
కేంద్రకారాగారం ,విశాఖపట్నం

# ఈత కోసం రిజర్వాయర్‌కు వెళ్లొద్దు

## పరిస్థితి అదుపులోనే ఉంది -జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్





**విశాఖ సిటీ, పెన్ పవర్, సెప్టెంబర్ 09**

మేఘాద్రి గెడ్డ రిజర్వాయర్ పరివాహక ప్రాంతంలోని ప్రజలు ఆందోళన చెందనవసరం లేదని, పరిస్థితి అదుపులోనే ఉందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పెందుర్తి మండలంలోని మేఘాద్రిగెడ్డ రిజర్వా యర్ స్థితిగతులను విశాఖ పశ్చిమ ఎంఎల్ఏ గణబాబుతో కలిసి జిల్లా కలెక్టర్ సోమవారం పరిశీలించారు. అనంతరం రిజర్వాయర్ పరివాహక ప్రాంతాలు, గోపాలపట్నంలోని పలు ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ రిజర్వాయర్ నీటి మట్టం 61 అడుగులు కాగా, ప్రస్తుతం 57.4 అడుగుల మేర నీరు జలాశయంలోకి చేరిందని అన్నారు. ప్రస్తుతం పరివాహక ప్రాంతంలో వర్షాలు లేనందున ఎటువంటి ఇబ్బంది లేదని, పరిస్థితి అదుపులో ఉన్నట్లు చెప్పారు. జలాశయంకు ఉన్న ఆరు గేట్లకు గాను నాలుగు గేట్ల ద్వారా నీటిని దిగువ ప్రాంతాలకు వదిలేందుకు ఇరిగేషన్, రెవిన్యూ, పోలీస్ శాఖలు సిద్ధంగా ఉన్నట్లు వివరించా రు.రాబోయే రోజుల్లో జలాశయం నీటిని పూర్తిగా తాగునీటికి వినియోగించ నున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎడతెరపి లేకుండా కురుస్తు న్న వర్షాల నేపథ్యం లో గోపాలపట్నంలో ఏర్పాటు చేసిన పునరా వాస కేంద్రాన్ని ఎం.ఎల్. ఏ గణబాబుతో కలిసి కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అన్ని విధాల అండగా ఉంటామని, ఎటువంటి ఆందోళన చెందనవ సరం లేదని పేర్కొన్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని, అన్నీ సానుకూ లంగా ఉండేవరకు పునరావాస కేంద్రాల్లో ఉండేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఈత కోసం రిజర్వాయర్ కు వెళ్లొద్దు భారీవర్షాల కారణంగా మేఘాద్రి గెడ్డ జలాశ యంలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉందని, ఇటువంటి పరిస్థితిల్లో ఈత కోసం రిజర్వాయర్ కు ఎవరూ వెళ్ళొద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## 87 వ వార్డులోవడ్లపూడి శ్రీ వర సిద్ధి వినాయక చవితి మహోత్సవాలు



**గాజువాక పెన్ పవర్ సెప్టెంబర్09**

వరసిద్ధి వినాయక చవితి మహోత్సవాలు జీవీఎంసీ 87 వ వార్డు పరిధి గల వీధిలో రామాలయం వెనకాల వినాయక విగ్రహాన్ని విగ్రహ ప్రతిష్ట జరిగింది నిర్వాహకుల ఆహ్వానం మేరకు విజపి యూత్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా గాజువాక మాజీ శాసనసభ్యుడు తిప్పల నాగిరెడ్డి మరియు చింతలపూడి వెంకటరామయ్య , మరియు జనసేన పార్టీ 87వార్డు వీర మహిళా ఇంద్ర ప్రియా దర్శిని ,వార్డు సీనియర్ నాయకులు పాల్గొని గణపతి స్వామి వారికి ప్రత్యేక పూజలు మరియు కుంకుమ పూజలు నిర్వహించి మరియు తీర్థప్రసాదాలు స్వీకరించారు మాట్లాడుతూ తెలుగు ప్రజలు అందరూ తొలి పూజ జరుపుకునే గణపతి స్వామి వారి కరుణాకటాక్షాలతో రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని నవరాత్రులను అందరూ కలిసి ఎంతో ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతోందని అన్నారు. ప్రజలందరిపై స్వామివారి కరుణాకటాక్షాలు ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంత అందరూ ఉండాలని ఆ గణపతిని కోరుకుంటాను అని అన్నారు . ఈ కార్యక్రమంలో విజపి యూత్ సభ్యులు మరియు అధిక సంఖ్యలో భక్తులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పాడుబడిన స్కూల్ భవనాన్ని దగ్గరుండి పడగొట్టించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

**విశాఖ సిటీ, పెన్ పవర్, సెప్టెంబర్ 09**

పాడుబడిన స్థితిలో ఉన్న పద్మనాభం మండలంలోని బుడ్డివలస స్కూల్ భవనాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ముందు జాగ్రత్తగా దగ్గరుండి కూల్చివేయించారు. ఇక్కడ నడుస్తున్న ఎలిమెంటరీ స్కూల్ భవనం చాలాకాలంగా అవసాన దశలో ఉంది. గత రెండు రోజులుగా కురుస్తున్న కుంభవృష్టి వల్ల మరింత ప్రమాదకరంగా తయారైంది. వర్ష ప్రభావిత ప్రాంతాల పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే గంటా సోమవారం పద్మనాభం, భీమి లి, ఆనందపురం మండలాల్లో పర్యటించారు. కూలిపోయే స్థితిలో ఉన్న పాత స్కూల్ భవనా న్ని చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న తరగతి గదిలో చదువుకుంటున్న విద్యార్థులు దీని వల్ల ప్రమాదం బారిన పడే అవకాశముం దని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పటికప్పుడు జేసీబీని రప్పించి దగ్గరుండి పడగొట్టించారు. అనంతరం పాండ్రంగి బ్రిడ్జి, మహారాజు పేట ముంపు ప్రాంతాలను కూడా పరిశీలించారు.



# పర్యాటక కేంద్రంగా గంభీరం రిజర్వాయర్

## నియోజకవర్గంలో నష్టం తెలుసుకోవడానికి పర్యటన

## పరిస్థితి అదుపులోనే ఉందన్న ఎమ్మెల్యే గంటా





**విశాఖ సిటీ, పెన్ పవర్, సెప్టెంబర్ 09 :**

గంభీరం రిజర్వాయర్ లాంటి ఆహ్లాదకరమైన ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి గల అవకాశాలు పరిశీలిస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. కుండపోత వర్షాల నేపథ్యంలో గంభీరం రిజర్వా యర్ నీటి మట్టాన్ని సోమవారం పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ చుట్టూ పచ్చని కొండలతో నగరానికి దగ్గర్లో ప్రశాంతంగా ఉన్న ఈ ప్రాంతంలో కాటేజీలు నిర్మిస్తే పెద్ద ఎత్తున పర్యాటకులు వస్తారన్నారు. రిజర్వాయర్ వరకు ఉన్న అప్రోచ్ రోడ్డును జీవీఎంసీ సహకారంతో అభివృద్ధి చేస్తామని తెలిపారు. వర్షం కారణంగా జరిగిన నష్టం వివరాలను తెలుసుకోవడానికి నియోజకవ ర్గంలో పర్యటించానని వివరించారు. పద్మనాభం, ఆనందపురం, భీమిలి మండలాల్లో కాజ్ వే లపైన వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తోందని చెప్పారు. ప్రాణ నష్టం జరగకుండా చూడడంతో పాటు సాధ్యమైనం తగా ఆస్తి, పంట నష్టాలను తగ్గించడానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అదృష్టవశాత్తు నియోజకవర్గంలో భారీ నష్టాలేవీ నమోదు కాలేదన్నారు. వలలు కొట్టుకుపోయి నష్టం జరిగినట్లు మత్స్యకారులు చెప్పారని, ఆ వివరాలను ప్రభుత్వానికి పంపాలని అధికారులకు సూచించానని వెల్లడించారు.

# 53 మందిని జీ.వీ.ఎం.సీ ఏర్పాటుచేసిన పునరవాస కేంద్రాలకు తరలింపు

## జీ.వీ.ఎం.సీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి





**విశాఖ సిటి పెన్ పవర్, సెప్టెంబర్ 09**

నగరంలో వర్షాలు పడుతున్న దృష్ట్యా కొండవాలు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశామని, ప్రస్తుతం 45 మందిని జీవీఎంసీ ఏర్పాటుచేసిన పునరవాస కేంద్రాలకు తరలించామని జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా జీ.వీ.ఎం.సీ అదనపు కమిషనర్ మాట్లాడుతూ ఆదివారం నగరం లో ఎడతెరపిలేని వర్షం కారణంగా 8వ జోన్ 91వ వార్డు పరిధిలోని రామకృష్ణ నగర్ సమీపంలో కొండవాలు యొక్క రక్షణ గోడ జారినందున ఆ ప్రాంతంలోని 38 మందిని అప్రమత్తం చేసి జీవీఎంసీ ఏర్పాటుచేసిన గోపాలపట్నం మండల ప్రజా పరిషత్ పాఠశాలకు తరలించగా వారు ఆశ్రయం పొందుతున్నారని, అలాగే జోన్-1 తగరపువలస పబ్లిక్ లైబ్రరీలో ఏడుగురును, జోన్-2 13వ వార్డులో జైభీమ్ నగర్ ప్రాంతం లో నున్న 8 కుటుంబాలు చెందిన 20 మందిని పునరావాస కేంద్రాలకు తరలించి వారికి వసతితో పాటు భోజనం, తాగునీరు, మరుగుదొడ్లు, వైద్యం మొదలైన మౌలిక సదుపాయాలను కల్పించామన్నారు. నగరంలో వర్షాభావ పరిస్థితులు ఉన్నందున ముందస్తుగా 80 పునరావాస కేంద్రాలను సిద్ధం చేశామని, పునరవాస కేంద్రాలలో నున్న ప్రజలు ఆందోళనకు గురికాకుండా వారికి కౌన్సిలింగు చేస్తున్నామని ఆయన తెలిపారు. అలాగే కాలువలలో, ఎర్రిగెడ్డ లో వ్యర్థాలను లేకుండా ఎప్పటికప్పుడు యుద్ధ ప్రాతిపదికన తొలగిస్తున్నామని ఆయన తెలిపారు. నగరం లో వర్షాలు ప్రారంభమైన నుండి జివిఎంసి అధికారులు, జోనల్ కమీషనర్లు, కొండవాలు, లోతట్టు ప్రాంతాలను పర్యటిస్తూ ప్రజలను అప్రమత్తం నిరంతరం చేపడుతున్నారన్నారు. వర్షాలు కురిసే అవకాశం వున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాలు సంభవించే వరకు వేచి ఉండకుండా ముందస్తుగా పునరవాస కేంద్రాలకు ఆశ్రయం పొందేందుకు కొండవాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు జివిఎంసి అధికారులకు తెలియపరచాలన్నారు. అత్యవసరమైనచో జివిఎంసి టోల్ ఫ్రీ నెంబరు 1800 4250 0009 కు ఫోన్ చేసి ప్రజలు సమాచారాన్ని తెలియచేయాలని అదనపు కమీషనరు తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక విశాఖ నగర పోలీసు కమిషనర్ డా.శంఖబ్రాత భాగ్చి

**విశాఖ సిటీ ,పెన్ పవర్, సెప్టెంబర్ 09 :**

బాధితుల సమస్యలను తక్షణం పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించిన విశాఖ నగర పోలీసు కమిషనర్ డా.శంఖబ్రాత భాగ్చి, ఐ.పీ.ఎస్ ప్రతీ సోమవారం పోలీసు కాన్ఫరెన్స్ హాల్ నందు నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు సోమవారం 59 ఫిర్యాదులు రావడం జరిగినది, సి.పి నిర్వహిం చిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వచ్చి తమ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు ఇచ్చిన ప్రతీ ఫిర్యాదును స్వయముగా తీసుకొని, వారి సమస్యలను పూర్తిగా తెలుసుకొన్న సి.పి ప్రజా ఫిర్యాదుల పరిష్కారం ఫిర్యాదుల పరిష్కా రంలో అలసత్వం చేస్తే తగు చర్యలు తీసుకోవ డతాయి అని అధికారులకు స్పష్టమైన ఆదేశా లను జారీ చేసిన నగర పోలీసు కమీషనర్ అడిషనల్ డి.జి.పి, కమీషనర్ ఆఫ్ పోలీస్ %ఇ% అడిషనల్ జిల్లా మేజిస్ట్రేట్ డా.శంఖబ్రాత భాగ్చి, ఐ.పీ.ఎస్. ఆధ్వర్యంలో ప్రతీ సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నగర పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో



నిర్వహించినారు.ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర పోలీసు కమిషనర్ తో పాటుగా జాయింట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ డా. కే.ఫక్కీరప్ప, ఐ.పీ.ఎస్.నగర సబ్-డివిజన్ ఏ.సి.పి లు మరియు పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ లు, ఎస్సైలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమం లో పాల్గొనీ, ఫిర్యాదులు స్వీకరించారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 59 మంది ఫిర్యాదుదారులు వచ్చి తమ తమ సమస్యల ను రిపోర్టులు ద్వారా పోలీసు ఉన్నతాధికా రులకు అందజేసినారు. పోలీసు ఉన్నతాధికా రులు ఫిర్యాదులను పరిశీలించి ఫిర్యాదిదారు లతో స్వయముగా మాట్లాడి, వారి వారి సమస్యలను తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో తక్షణమే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి, సమస్యకు సంబంధించి, చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదిదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించవలసి నదిగా ఆదేశాలు ఇవ్వడమైనది. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదుదారులు ఇచ్చిన ఫిర్యాదులలో కుటుం బ కలహాలు, భూ వివాదాలు, భార్య భర్తల గొడ వలు, మోసానికి సంబంధించినవి మరియు సివిల్ కేసుల విషయం సంబంధించిన ఫిర్యాదు లు ఉన్నాయి.

## విశాఖ కైలాషగిరి కొండ పై

# బస్సు ప్రమాదం

### తృటిలో తప్పిన పెను ప్రమాదం

### బ్రేక్స్ ఫెల్యూర్ కావడంతో జరిగిన ప్రమాదం

### సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీస్ కమిషనర్








**విశాఖ తూర్పు పెన్ పవర్ సెప్టెంబర్ 9**

డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. కైలాసగిరి పై నుండి మొదటి మలుపు వద్ద బస్ తిరుగు తుండగా బ్రేకులు ఫెయిల్ అవ్వడంతో డ్రైవర్ చాకచక్యంగా ప్రమాదం జరగకుండా పక్కన ఉన్న గోడకు ఢీ కొట్టించాడు. ఆ సంఘటనలో డ్రైవర్ అలా వ్యవహరించకపోవడంతో పెను ప్రమాదం జరిగి ఉండేది. ప్రమాదంలో 16 మందికి స్వల్ప గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని కేజీహెచ్ కు తరలించారు.ఘటన స్థలాన్ని పోలీస్ కమిషనర్ పరిశీలించారు. మిగిలిన వివరాలు తెలియాల్సి ఉంది.

# మొక్కుబడిగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

**అసంతృప్తి వ్యక్తం చేసిన పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు.**

పరవాడ ( పెన్ పవర్) సెప్టెంబర్ 9: మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన సర్వ సభ్యుల సమావేశం బూతు మాత్రంగా సాగింది. ఎంపీపీ పైల వెంకట పద్మా లక్ష్మి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచికల రమేష్ బాబు అధ్యక్షునలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి మెజారిటీ సభ్యులు డుమ్మ కొట్టడంతో మొక్కుబడిగా మమ అనిపించారు. సుమారు నాలుగు కోట్ల 35 లక్షల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అభివృద్ధి పనులకు తీర్మానం చేయవలసిన ఈ సమావేశానికి మెజారిటీ గౌర సభ్యులు హాజరు కాకపోవడం పట్ల పెందుర్తి ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. వర్షాలు పడుతూ ఉండటం వలనో లేక ఎమ్మెల్యే సమక్ష నిర్వహించారు సమాచారం లేకపోవడమె గాని కారణాలు ఏమైనాప్పటికీ తక్కువ సంఖ్యలో గౌరవ సభ్యుల హాజరు కావడం వలన సర్వసభ్య సమావేశం కల తప్పింది. రోడ్లు భవనాలు, గ్రామీణ నీటపారుదల, వైద్య ఆరోగ్య, విద్యుత్ శాఖలపై ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేయబోయే పనులపై గౌరవ సభ్యుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. గంటలోపే సమావేశాన్ని ముగించేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హేమ సుందర్ రావు, ఎంపీటీసీ సభ్యులపైల శ్రీనివాసరావు, సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, మండలంలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



## వరద బాధితుల సహాయ నిధికి రక్షిత్ డ్రగ్స్, సాయినార్ కంపెనీల భారీ విరాళం

**రూ "10 లక్షలు వితరణ.**

**డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్కు చెక్కులు అందజేసిన చైర్మన్ రామేశ్వరరావు.**

**పరవాడ, పెన్ పవర్, సెప్టెంబర్ 9**



వరద బాధితుల సహాయనిధికి రక్షిత్ డ్రగ్స్, సాయినార్ కంపెనీలు సంయుక్తంగా భారీ విరాళం ప్రకటించారు. రూ "10 లక్షల రూపాయల చెక్కులను రక్షిత్ డ్రగ్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ రామేశ్వరరావు సోమవారం డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్ కు అందజేశారు. తుఫాను విపత్తుకి విజయవాడ, పరిసర ప్రాంతాలు జలమయం అవ్వడమే కాకుండా తీవ్ర పంట, ఆస్తి, ప్రాణ నష్టం జరిగిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కొణిదెల పవన్ కళ్యాణ్, జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ ల పిలుపుమేరకు వరద బాధితుల సహాయ నిధికి ఆర్థిక సహాయం సామాజిక బాధ్యతలో భాగంగా అందజేయడం జరిగిందని చైర్మన్ రామేశ్వరరావు పేర్కొన్నారు. విపత్తు నుండి విజయవాడ పరిసర ప్రాంతాలు త్వరగా కోలుకోవాలని యధాస్థితికి రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రమాద భరితం గా 12వ వార్డు పాత ఆరిలోవ కొండవాలు ప్రాంతం



**విశాఖ తూర్పు పెన్ పవర్ సెప్టెంబర్ 9**

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకుకురిసిన 12వ వార్డు పాత ఆరిలోవ బీసీ కాలనీ కొండ ప్రాంతం లో పెద్ద బండ రాళ్లు పడిపోయే స్థితిలో ఉన్నాయి. ఆ ప్రాంతాన్ని సోమవారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఒమ్మి సన్యాసరావు. 11వ వార్డ్ అధ్యక్షులు ముగడ రాజారావు,గాడి సత్యం. బుడుమూరి గోవింద్. పరిశీలించి అధికారులకు తెలియజేశారు. వర్క్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ సిబ్బంది బండరాళ్ళను గుర్తించి వెంటనే తొలగించడం తో భారీ ప్రమాదం స్థానిక ప్రజలు అధికారులకు నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు గణేష్, కొల్లి ఎర్రాజీ రావు, గొలగాని రాంబాబు పాల్గొన్నారు.

## యుద్ధ ప్రాతిపదికపై చర్యలు చేపట్టాలని.. అధికారులకు ఆదేశించిన ఎమ్మెల్యే గణబాబు



**గోపాలపట్నం, పెన్ పవర్, సెప్టెంబర్ 9**

జీవీఎంసీ 90వ వార్డు, లక్ష్మి నగర్ ఎఫ్ బ్లాక్, కొండ ప్రాంతంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షల కారణంగా కొండ చర్యలు విరిగి పాక్షికంగా దెబ్బతిన్న ప్రాంతాన్ని హుటావుటిన చేరుకొని, పశ్చిమ శాసనసభ్యలు గణబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా యుద్ధ ప్రాతిపదికగా చర్యలు చేపట్టి, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులుకు అదేశించారు.

## జోన్ 2 -13 వ వార్డులో పునరావాస కేంద్రం

**భోజనం చీరలు అందజేసిన కెల్లా సత్యనారాయణ**

**విశాఖ తూర్పు పెన్ పవర్ సెప్టెంబర్ 9**

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా జోన్ -2 పరిధి 13వ వార్డులో అధికారులు ఏర్పాటు చేసిన పునరవాస కేంద్రంలో భోజనం, చీరలను అందజేసిన కెల్ల సత్యనారాయణ. సి.ఓ అప్పలకొండమ్మ.బేత దుర్గారావు,తదితరులు పాల్గొన్నారు.





# భారీ వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాలను పర్యటించిన ఎంపీ, ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్









**గోపాలపట్నం, పెన్ పవర్, సెప్టెంబర్ 9**

జీవీఎంసీ 89, 90, 91వ వార్డుల్లో పార్లమెంట్ సభ్యులు భారత్, పశ్చిమ శాసనసభ్యులు గణబాబు, విశాఖ జిల్లా కలెక్టర్ పర్యటించారు. రామకృష్ణనగర్, లక్ష్మి నగర్ ఎఫ్ బ్లాక్ లో భారీ వర్షాలకు కొండ చర్యలు విరిగి పాక్షికంగా దెబ్బతిన్న ప్రాంతాలను మరియు మరియు కొత్తపాలెం శివారు ప్రాంతాల్లో భారీ వర్షాలకు పాడైన రహదారిని, లోతట్టు ప్రాంతాలను హుటాహుటిన వెళ్లి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యుద్ధ ప్రాతిపదంగా చర్యలు చేపట్టి, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులుకు అదేశించారు. ప్రస్తుతం లక్ష్మీ నగర్ ఎంపీపీ స్కూల్ లో ఆశ్రమం పొందుతున్న నిరాశ్రయులను పరామర్శించి, యోగక్షేమాలు సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు.

## జర్నలిస్టుల సేవలు సమాజానికి అవసరం

### దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ



**విశాఖ సిటి, పెన్ పవర్, సెప్టెంబర్ 09**

ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా విధి నిర్వహణ చేస్తున్న జర్నలిస్టుల సేవలు సమాజానికి అవసరమని విశాఖ దక్షిణ నియోజక వర్గ ఎమ్మెల్యే సిహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొ న్నారు.జర్నలిస్ట్ డే సందర్భంగా నగరంలో పని చేస్తున్న పలువురు జర్నలిస్టులను విశాఖ దక్షిణ నియోజకవర్గ జనసేన సీనియర్ నాయకులు, 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ జర్నలిస్టుల సేవలు ప్రభుత్వానికి ప్రజలకు అవసరమన్నా రు. ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించి జర్నలిస్టులను సన్మానించిన డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ సమాజంలో ఎన్నో కష్ట నష్టాలకు, వ్యయ ప్రయాసలకు ఓర్చి వార్తలు సేకరించి సమాజ హితం కోసం పనిచేసే జర్నలిస్టులను సన్మానించడం చాలా ఆనందంగా ఉందన్నారు. వారికి తానెప్పుడూ అండగా ఉంటానని చెప్పారు. తన రాజకీయ ప్రయాణం పూర్తిగా తనను అభిమానించే జర్నలిస్టు సోదర సోదరీమణుల సహకారంతోనే ముందుకు వెళుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ జర్నలిస్టుల జీవిత స్వప్నమైన ఇండ్ల స్థలాల సాధన కోసం ప్రభుత్వ పెద్దలను కలుస్తూ గట్టి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నా మన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 60 మంది జర్నలిస్టులను దుశ్శాలువలతో సత్కరించి డ్రై ఫ్రూట్స్ బాహూక రించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గ జనసేన యువ నాయకులు కందుల కేదార్నాథ్, కందుల బదరీనాథ్, తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి రామ్, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సింహాచలం కొండపై ఇంజనీరింగ్ అధికారులతో పర్యటించిన ఈవో

**అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం**







**సింహాచలం, పెన్ పవర్, సెప్టెంబర్ 9**

అల్పపీడనం ప్రభావం వలన కురిసిన భారీ వర్షాల కారణంగా సింహాచలం ఇంజనీరింగ్ అధికారులతో ఈవో శ్రీనివాసమూర్తి పర్యటించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. శ్రీ వరాహాలక్ష్మీ నరసింహ స్వామివారి దేవస్థానం, సింహాచలం తుఫాన్ కారణంగా ఆలయము లోపల ప్రసాదాల కౌంటర్ల వద్ద దేవస్థానం భవనాలలో అన్నదానం భక్తులు వినియోగించే వివిధ వాటర్ ట్యాంకులను త్రాగే నీరు కలుషితం కాకుండా పబ్లిక్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్ వారితో కలిసి సమన్వయంతో చేసిన క్లోరినేషన్ ప్రక్రియలను పరిశీలించారు. వివిధ ప్రదేశాల్లో ఎక్కడ వర్షపు నీరు నిలవ ఉండకుండా అవసరమగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తుపాన్ కారణంగా కొండపైన మరియు కొండదిగో ప్రాంతాల్లో అన్ని చోట్ల శానిటేషన్ మరియు డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు సిబ్బందితో శుభ్రం చేయించి, దేవస్థానం సంబంధించి అన్ని ప్రదేశాల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని, కొబ్బరికాయ కొట్టి ప్రదేశాలు వద్ద కొబ్బరి చిప్పలలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయంలోపుల, వెలుపల భక్తులు సంచరించే క్యూలైన్లు ఉచిత ప్రసాదం పంపిణీ, కేశఖండశాల, గంగధార ప్రాంతాలలో ఎప్పటికప్పుడు శా నిటేషన్ చేయుటపై అధికారులుకు ఆదేశించారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాంబాబు, డిఈ హరి, ఏఈఓ ఆనంద్ కుమార్, నాగేశ్వరరావు, ఆలయ పర్యవేక్షణ అధికారి రమణకు ఇతర అధికారులకు తగిన సూచనలు చేశారు.

## జిల్లా ఎస్పీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక పబ్లిక్ గ్రీవెన్స్ కి 10 ఫిర్యాదులు





**అనకాపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 9**

జిల్లా ఎస్పీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సెల్ సిస్టం కార్యక్రమానికి 10 ఫిర్యాదులు అందాయి. ప్రజా సమస్యలను చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించ వలసిందిగా సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి సత్వర న్యాయం చేయవలసిందిగా జిల్లా ఎస్పీ ఎం.దీపిక ఐపీఎస్ ఆదేశాలు జారీ చేశారు. అనకాపల్లి, జిల్లా పోలీసు కార్యలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన 10 ఫిర్యాదులలో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు తదితర ఫిర్యాదులు అందాయి. ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ మరియు అదనపు ఎస్పీ నేరుగా ఫిర్యదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహన్ రావు, ఎస్సై దివ్య పాల్గొన్నారు.

# కాంట్రాక్టు నర్సులు అందరినీ రెగ్యులర్ చేయాలి

**తక్షణమే జీవో నంబర్ 115 ను రద్దు చేయాలి -కూటమి ప్రభుత్వానికి తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ డిమాండ్**

**వై.సి.పి ప్రభుత్వం తప్పుడు నిర్ణయాలతో ఏ.ఎన్.ఎం లకు నామమాత్రపు శిక్షణ - అదే శిక్షణ ఆధారంగా ఏఎన్ఎం లకు స్టాఫ్ నర్సులుగా పదోన్నతి**

**ఈ మేరకు ఉత్తరులను జారీ చేసిన కూటమి ప్రభుత్వం- నర్సింగ్ లో డిగ్రీ / పీజీ / పి హెచ్ డి చేసిన వారిని పక్కన పెట్టడం ఏమిటి**

**కోవిడ్ సమయంలోను కాంట్రాక్టు నర్సులు అమూల్యమైన సేవలు అందించారు-కాంట్రాక్టు నర్సులకు న్యాయం జరిగే వరకు తెలుగు శక్తి పోరాటం**

**విశాఖ సిటి, పెన్ పవర్, సెప్టెంబర్. 09**

రాష్ట్రంలోని వివిధ ఆస్పత్రులలో పని చేస్తున్న కాంట్రాక్టు నర్స్ లు అందరినీ రెగ్యులర్ చేయాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ డిమాండ్ చేస్తున్నారు. తమ హక్కుల సాధన కోసం.. కేజీహెచ్ క్లాక్ టవర్ వద్ద కాంట్రాక్ట్ నర్సులు సోమవారం చేపడుతున్న నిరసనకు తెలుగు శక్తి సంఘీభావం ప్రకటించింది. ఈ సందర్భంగా బి.వి.రామ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ, సంక్షేమ శాఖ ఇటీవల జారీ చేసిన జీవో నెంబర్ 115 ను తక్షణమే రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. జీవో నెంబర్ 115 రద్దు అయితేనే కాంట్రాక్టు నర్సులకు న్యాయం జరుగుతుంద న్నారు. ఉత్తరాంధ్ర ఆరోగ్యపదాయని కే జి హెచ్ తో పాటు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 11,500 మంది నర్సులు ( మేల్ /ఫీమేల్ ) కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేస్తున్నారన్నారు. నర్సింగ్ విద్యలో మూడు సంవత్సరాల డిగ్రీ చేసినవారు, పీజీ చేసినవారు, పీహెచ్డీ చేసినవారు.. కోవిడ్ కు ముందు నుంచి కూడా తమ అమూల్యమైన సేవలను అందిస్తున్నారు అన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం తీసుకున్న తప్పుడు నిర్ణయాల కారణంగా సచివాలయంలో పనిచేస్తున్న ఏఎన్ఎం లకు ఎం పి హెచ్ డబ్ల్యూ పేరుతో నామమాత్రపు శిక్షణ ఇచ్చారన్నారు. వారు ఎంత శిక్షణ పొందినప్పటికీ నర్సింగ్ లో డిగ్రీ, పీజీ, పీహెచ్డీ చేసిన



వారితో సమానంగా నాణ్యమైన వైద్య సేవలను ఏఎన్ఎంలు అందించలేరని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అయినప్పటికీ తాజాగా కూటమి ప్రభుత్వం.. వైసిపి హయాంలో శిక్షణ పొందిన 2,112 మంది సచివాలయ ఏఎన్ఎం లకు రాష్ట్రంలోని వివిధ ఆస్పత్రులలో స్టాఫ్ నర్సులుగా విధులు నిర్వర్తించేందుకు ఉత్తర్వులు జారీ చేసింద న్నారు. వీరికి జీతంతో పాటు ప్రతి నెల 5000 రూపాయల ప్రోత్సాహం కూడా ప్రభుత్వం అందించబోతుందన్నారు. అన్ని విధాలుగా శిక్షణ పొంది.. ప్రపంచాన్ని గడగడ లాడించిన కోవిడ్ సమయంలో కూడా కుటుంబాలను సైతం పక్కనపెట్టి తమ అమూల్యమైన సేవలను అందించిన.. కాంట్రాక్ట్ నర్సులకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఏఎన్ఎంలకు నర్సులుగా అందలం ఎక్కించడం ఏంటని బి.వి.రామ్ కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని సమీక్షించుకోవాలన్నారు. ఏది ఏమైనప్పటికీ కాంట్రాక్టు నర్సులకు.. స్టాఫ్ నర్స్ లుగా ఉద్యోగ బాధ్యతలను అప్పగించాలని డిమాండ్ చేశారు. స్టాఫ్ నర్స్ లకు న్యాయం చేసే వరకు తెలుగు శక్తి పోరాటం కొనసాగిస్తుం దని బి.వి.రామ్ ఈ సందర్భంగా తెలియజేశారు.

సూర్య కళకు ప్రభుత్వం 50 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించాలి,కోవిడ్ సమయంలో ఒక చిన్నారిని కాపాడటం కోసం కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ సూర్య కళ ప్రాణాలు సైతం లెక్కచేయ కుండా కాపాడి తన కల్లు పోగొట్టుకొని, కానీ గత ప్రభుత్వం ఎటువంటి ఎక్స్గ్రేషియా ప్రకటించలే దు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ సూర్య కళకు ప్రభుత్వం 50 లక్షల ఎక్స్గ్రేషియా ఇవ్వాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ కోరారు. ఈ కార్యక్రమంలో జి.శాంతమ్మ, బి.శాంతి కుమారి, డాక్టర్ పప్పూర్ నికుంజ్, వి.వెనిలా, ఎస్.వరలక్ష్మి, ఎన్.శోభారాణి, అధిక సంఖ్యలో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు మరియు నర్సింగ్ స్టూడెంట్లు పాల్గొన్నారు.

# చత్రాపల్లి గ్రామస్తులకు పునరావాసం ఏర్పాట్లు - ఐటిడిఏ పిఓ వి.అభిషేక్







**గూడెం కొత్తవీధి,పెన్ పవర్ సెప్టెంబరు 9**

అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలోని చత్రాపల్లి గ్రామస్తులకు పురావాస ఏర్పాట్లు చేస్తున్నామని ఐటిడిఏ పి.ఓ వి. అభిషేక్ స్పష్టం చేసారు. సోమవారం జి. కె. వీధి మండలంలో పర్యటించి గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు దెబ్బ తిన్న రోడ్లు కల్వర్టులను పరిశీలించారు. చత్రాపల్లి గ్రామానికి వెళ్లాలని ప్రయత్నించిన పి. ఓకు రహదారి మార్గం లేదని అధికారులు చెప్పడంతో గ్రామస్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. చత్రాపల్లి గ్రామంలో 30 కుటుంబాలు 120 మంది జనాభా ఉన్నారని రెవెన్యూ అధికారులు పి.ఓ దృష్టికి తీసుకుని వచ్చారు. చత్రాపల్లి గ్రామస్తులను సప్పర్ల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు తరలించి పునరావాసం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అందరకి భోజన వసతి సదుపాయాలు కల్పించాలని చెప్పారు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనాలను రెవెన్యూ అధికారులు ఆధీనంలోకి తీసుకుని బాధితులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. వైద్య సేవలు అవసరమైన వారికి సప్పర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యం అందించాలని సూచించారు. సంపంగి గొంది,లంకపాకలు గ్రామాల వరకు పర్యటించి దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులను పరిశీలించారు. జాతీయ రహదారి అధికారుల సహాయం తీసుకుని యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. లంకపాకలు గ్రామం వద్ద కల్వర్టు దగ్గర బారి కేడింగ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. రహదారుల పునరుద్ధరణ పనులు వేగంగా పూర్తి చేయాలని రహదారులు భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా నేషనల్ హైవే అధికారుతో మాట్లాడే రహదారుల మరమ్మతులకు సహకారం అందించాలని అన్నారు. రింతాడ గ్రామం వద్ద వర్షాలకు దెబ్బతిన్న రహదారిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రహదారులు భవనాల శాఖ బాల సుందర బాబు,గిరిజన సంక్షేమ శాఖ డి. ఇ చాణక్యరావు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## "ఎస్.ఎస్.సి.జి.డి" కానిస్టేబుల్ ఉద్యోగాలకు దరఖాస్తులు

**కొయ్యూరు సీఐ పి. వెంకటరమణ వెల్లడి**



**కొయ్యూరు,పెన్ పవర్ సెప్టెంబర్9**

"ఎస్ ఎస్ సి జి డి" కానిస్టేబుల్ ఉద్యోగాలకు అర్హులైన నిరుద్యోగ యువత దరఖాస్తులు చేసుకోవాలని కొయ్యూరు సీఐ పి. వెంకటరమణ ఒక ప్రకటనలో కోరారు. 18 నుండి 23 సంవత్సరాల మధ్య వయసు గల అభ్యర్థులు అర్హులన్నారు. అయితే ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు ఐదు ఏళ్ళు మినహాయింపు ఉంటుందన్నారు. వచ్చేనెల అక్టోబర్ 14 తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులందరూ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు తమ పోలీస్ శాఖ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు సిఐ వివరించారు. మరిన్ని వివరాలకు స్థానిక సచివాలయ మహిళా పోలీసు లను, అలాగే పోలీస్ స్టేషన్లోనూ సంప్రదించాలని ఆయన సూచించారు.

## యువత ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం



**గాజువాక :పెన్ పవర్, సెప్టెంబర్ 09**

69 వ వార్డు కాపు తుంగ్లాం గ్రామంలో అకాలమరణం పొందిన కొంతమంది యువత జ్ఞాపకార్థం నిన్న జరిగిన రక్తదాన శిబిరంలో గ్రామ యువత తుఫాన్ ని కూడా లెక్కచేయకుండా రక్తదాన శిబిరం నిర్వహించి విజయవంతం చేశారు. కార్యక్రమం లో గ్రామ యువత, గ్రామ పెద్దలు,కూటమి నాయకుడు కరణం ముత్యాల నాయుడు రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను స్వయంగా అందజేశారు . రాజకీయాలకు అతీతంగా స్వచ్ఛందంగా రక్తదాన శిబిరంలో పాల్గొన్న యువతను అభినందించారు.

## రింతాడ పంచాయితీలో భారీగా ఇండ్లకు నష్టం

**పరిశీలించిన ఉపసర్పంచ్ సోమేశ్ సచివాలయ సిబ్బంది**





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, సెప్టెంబర్09**

అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం రింతాడా పంచాయతీ పరిధిలోనీ పలు గ్రామాలలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఇండ్లకు తీవ్ర నష్టం ఏర్పడింది. దీంతో ఈ సమాచారం అందుకున్న రింతాడ గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ సోమేశ్ కుమార్ సచివాలయ సిబ్బంది కలిసి పలు గ్రామాలలో పడిపోయిన ఇండ్లను పరిశీలించారు. సకాలంలో స్పందించి అధికారులకు సమాచారం అందించి ఇండ్ల పడిపోయిన గిరిజనులకు నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా కడుగుల గ్రామానికి చెందిన వంతల లక్ష్మణరావు ఇల్లు వర్షానికి తడిసి పడిపోయింది. వంతెన సత్తిబాబు ఇల్లు కూడా తడిసి పడిపోయింది. పొత్తూరు దారమణి గృహం కూడా పడింది ఇలా పంచాయతీలో పడిపోయిన ఇండ్ల వివరాలను పంచాయతీ కార్యదర్శి సూర్య ప్రకాష్,ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఉషా,డిజిటల్ అసిస్టెంట్ చిన్నారావు లతో కలిసి భారీ వర్షాలకు ఇల్లు కూలిపోయిన వివరాలను సేకరించారు.

# వర్షాలాకు అతలాకుతలమైన గూడెం కొత్తవీధి మండలం

**సమస్యల వెలికితీతలో మీడియా కృషి అభినందనీయం -ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకోవాలి**

**చనిపోయిన వ్యక్తులకు కోటి రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలి**

**గిరి జన జాగృతి సమన్వయ సమితి అధ్యక్షుడు ముర్ల వెంకటరమణ**



**గూడెం కొత్త వీధి పెన్ పవర్ సెప్టెంబర్ 9**

గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వలన అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలో తీవ్రమైన ఆస్తి ప్రాణ నష్టాలు సంభవించాయని అధికారులు దీనిపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని గిరి జనజాగృతి సమన్వయ సమితి అధ్యక్షుడు ముర్ల వెంకటరమణ ఒక ప్రకటనలో కోరారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా ఎన్నడూ లేని విదంగా గూడెం కొత్తవీధి మండలంలోని పదహారు పంచాయతీలలోని గ్రామాల్లో కూడా పరిస్థితి దారుణంగా ఉంది. ఒక గ్రామానికి మరియొక గ్రామానికి సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. ఎక్కడికక్కడ కల్వర్థులు, వంతెనలు తెగిపోవడం వల్ల జనజీవనం అస్తవ్యస్థమయ్యింది. నిత్యావసర సరుకులు లేవు, రోగులు ఆసుపత్రులకీ వెళ్లే మార్గం లేదు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీల పరిస్థితి మరీ దారుణం,నీరు కలుషితమవ్వడం వల్ల అంటురోగాలు ప్రభలుతున్నాయి. పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి. ఈ సంవత్సరం తిండి గింజలు లేనట్టే! అధికారులు త్వరగా స్పందించకపోతే భారీగా ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉంది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లల తల్లులు,పిల్లలు రోగాల బారిన పడే అవకాశం ఉంది. ఇప్పటి వరకు ఆదివాసీ ప్రాంతం అన్నివిధాలా నిర్లక్ష్యం నీడనే ఉండేది. ఈ తుఫాను వల్ల అందుబాటులో గల అరకొర వసతులు కూడా వరదల్లో కొట్టుకొనిపోవడం వల్ల జనజీవనానికి దిక్కుతోచని స్థితి ఏర్పడింది. విజయవాడ పట్టణం మునిగినప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దగ్గరుండి సహాయసహకారాలు అందించడం చూసాము. అలాగే మా ప్రాంతాన్నికూడా ముఖ్యమంత్రి పట్టించుకో వాలని కోరుతున్నాము. అధికశాతం నిధులు కేటాయించి త్వరితగతిన పరిస్థితిని అదుపులోనికి తేవాలని కోరుతున్నాము. రోడ్లు, సమాచార వ్యవస్థ, ఆసుపత్రులు, బలోపేతం, అయ్యే విదంగా అదనపు నిధులతో కార్యకలాపాలు నిర్వహించవలసిందిగా కోరుతున్నాము. ఇల్లు కోల్పోయిన వారికి పక్కా గృహల నిర్మాణం, ప్రాణనష్టం జరిగిన కుటుంబాలకు కోటి రూపాయలు చొప్పున పరిహారం, అందించాలని కోరుతున్నాము. అన్ని ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలను సామాజిక ఆరోగ్య కేంద్రాలుగా మార్పుచేస్తూ అన్నిరకాల వైద్యులను అందుబాటులో ఉంచాలని కోరుతున్నాము. అన్ని గ్రామాల నుంచి పంచాయతీ వరకు, పంచాయతీ నుంచి మండలానికి మండలం నుంచి జిల్లా కేంద్రానికి రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరుతున్నాము. ప్రతీ పట్టణానికి రైళ్లు, విమానాలు తిరుగుతున్న ఈ డిజిటల్ యుగములో కూడా కనీసం అంబులెన్సు వెళ్లే దారిలేని గ్రామాలు మా ప్రాంతంలో ఉన్నాయంటే ఆది మా దురదృష్టమా, లేదంటే పాలకుల నిర్లక్ష్యమా అర్ధమవ్వడం లేదు... పాలకులు మారుతున్నారు, ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ మా బ్రతుకులు మారడం లేదు,మాలోనివారు ఎమ్మెల్యే లు,ఎంపి లు,మంత్రులు అవుతున్నారు. వారి బ్రతుకులే మారుతున్నాయి గాని మా బ్రతుకుల్లో ఏ మార్పు లేదు. ఏ ఎమ్మెల్యే మా గురించి అసెంబ్లీ లో మాట్లాడం మేము చూడలేదు. వారు కార్ల మీద తిరుగుతున్నారు వారి పిల్లలు విదేశాల్లో చదువుకుంటున్నారు. తప్పా సామాన్య ఆదివాసీల్లో ఏ మార్పూ కనబడడం లేదు. మా బ్రతుకులు బాగుపడే మార్గమే లేదా? మా తలరాతలు మార్చే నాథుడే లేడా? మా గ్రామాల్లో, మా బ్రతుకుల్లో వెలుగులు నిండేదెప్పుడో? ఇలాంటి ఏ చిన్న విపత్కర పరిస్థితి ఏర్పడినా బిక్కుబిక్కు మంటూ కాలం వెలిబుచ్చడమేనా? ఆదుకునే నాథుడే లేడా? భరోషా ఇచ్చే నాయకుడే లేడా? స్థానిక పత్రికలలో పేర్లు రాయించుకొనే నాయకులే తప్పా అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు అనుసంధానం చేయగల నాయకులు భవిష్యత్ లో పుడతారా? సమస్యల వెలికి తీతలో మీడియా ఎంతో కృషి చేస్తుంది,ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేసే నాయకులు అవసరం... అలాంటి నాయకులు ఎప్పుడు పుడతారో?. ఈ సందర్భంగా ఆదివాసీ ప్రజలకు దైర్యం చెప్పే నాయకత్వం అవసరం. పలకరించే నాయకత్వం అవసరం అని ముర్ల వెంకటరమణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రధానవంతెనల పై నుండి ప్రవహిస్తున్న వరదనీరు...!

**స్తంభించిన రాకపోకలు - ప్రకటనలకే పరిమితమైన ప్రతిపాదనలు**





**కొయ్యూరు,పెన్ పవర్ సెప్టెంబర్9:**

గత కొన్ని రోజులుగా కురుస్తున్న తుఫాను వర్షాల కారణంగా మండలంలో జనజీవనం స్తంభించిపోయింది. మండల కేంద్రమైన కొయ్యూరు, అలాగే కాకరపాడు గ్రామాల మధ్య గల రెండు ప్రధాన వంతెనల పై నుండి కూడా కాలువలు పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు కూడా విధులకు హాజరవ్వడానికి ఆటంకం ఏర్పడింది. పొంగి ప్రవహిస్తున్న కాలువలను జీసీసీ మాజీ చైర్మన్ ఎంవీవి ప్రసాద్, బీజేపీ నేత మేడిబోయిన చక్రరావు పరిశీలించారు. ప్రధాన వంతెనలను పునరుద్దరణ చేయాల్సి ఉందన్నారు. ఈ రెండు వంతెనలను రూ. 4కోట్లతో ఆధునీకరించడానికి ప్రతిపాదించినట్టు 4 సం.ల క్రితం అధికారులు ప్రకటించినా, కార్యరూపం దాల్చలేదు. చిన్న వర్షానికి కూడా ఈ వంతెనల పై నుండి కాలువలు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇదిలా ఉండగా ప్రస్తుత వర్షాలతో మండలంలోని గోపవరం గ్రామం పూర్తిగా జలమయమైంది. ఎం. భీమవరం, బూదరాళ్ళ, అంతాడ పంచాయతీల పరిధిలో కాలువలు పొంగి ప్రవహించడంతో గిరిజనులు అవస్థలు పడుతున్నారు. బూదరాళ్ళ ఘాట్లో కొండచరియలు, చెట్టు విరిగి పడటంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. యు. చీడిపాలెం గొట్లుపాడు కాలువ ఉధృతంగా ప్రవహించింది. బూదరాళ్ల పంచాయతీ, వంతమర్రి లో వంతల బుజ్జిబాబు ఇల్లు వర్షానికి కూలిపోయింది. ఇదిలా ఉండగా రామరాజుపాలెం వంతెన కొట్టుకుపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారని, ఇది ప్రభుత్వ వైఫల్యమేనని అరకు మాజీ ఎంపీ భర్త, నేను సైతం చైర్మన్ కే శివప్రసాద్ ఆరోపించారు.

# జిల్లా కలెక్టర్ ఆదేశాన్ని ఖాతరు చేయని గురుకులాల యాజమాన్యాలు

**వర్షాల కారణంగా జిల్లా కలెక్టర్ ప్రకటించే సెలవు ఆదేశాలు మాకు వర్తింప చేయాలి**

**గురుకుల విద్యాసంస్థల ఔట్సోర్సింగ్ సిబ్బంది డిమాండ్**

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్తవీధి,పెన్ పవర్ సెప్టెంబర్ 9**

అల్లూరి సీతారామరాజు జిల్లాలో వాతావరణ ప్రభావం వలన కురుస్తున్న విస్తార వర్షాలకు విద్యార్థులు ఇబ్బంది పడకూడదు అన్న ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ ప్రకటించే సెలవులను మాకు కూడా వర్తింపచేయాలని గురుకుల విద్యాసంస్థలలో విధులు నిర్వహిస్తున్న ఔట్సోర్సింగ్ సిబ్బంది కోరుతున్నారు. ఈ సందర్భంగా వారు ఒక ప్రకటన విడుదల చేస్తూ తీవ్ర తుఫాను వర్షాల కారణంగా పాఠశాలలు కళాశాలలకు వెళ్లే విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని జిల్లా కలెక్టర్ సెలవు ప్రకటిస్తూ ఆదేశాలు జారీ చేసే విషయంలో విద్యార్థులతో పాటు విధులకు హాజరయ్యే సిబ్బంది కూడా వర్తింపచేయాలని కోరారు. సిబ్బంది విధులకు వివిధ ప్రాంతాల నుండి ప్రయాణం చేస్తూ విధులకు హాజరు అయ్యే పరిస్థితి ఉన్నందున సిబ్బంది కూడా వర్షాలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సుదూర ప్రాంతాల నుండి పాఠశాలకు రావాల్సి ఉండటం వలన ప్రయాణానికి ఇబ్బంది అవుతుందని జిల్లా కలెక్టర్ సెలవు ప్రకటన ఆదేశాలు అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు కళాశాలల్లో వర్తిస్తున్న గాని కేవలం గిరిజన ప్రాంత గిరిజన గురుకుల విద్యాసంస్థల్లో మాత్రం సెలవు ఇవ్వటం లేదని, యాజమాన్యానికి అడిగితే అవి మీకు వర్తించవు అని అంటున్నారని కావున ఈ విషయం జిల్లా కలెక్టర్ పరిగణలోనికి తీసుకుని సిబ్బంది యొక్క ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వారికి కూడా సెలవు ప్రకటన ఆదేశాలు వర్తించేలా చేయాలని కోరుకుంటున్నామని జిల్లా ఔట్సోర్సింగ్ యూనియన్ ప్రెసిడెంట్ లోచల కొండబాబు, వైస్ ప్రెసిడెంట్ కే గణపతి, ఆర్గనైజేషన్ సెక్రటరీ జి రాజు, స్టేట్ సెక్రటరీలు ఓ.పోతురాజు, ఎల్ పోతురాజు మీడియా ముఖంగా కోరారు.

# అంగరంగ వైభముగా స్వామి వారి నిత్య కల్యాణం





**సింహాచలం, పెన్ పవర్, సెప్టెంబర్ 9**

ప్రముఖ పుణ్యక్షేత్రముగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామివారి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయ దేవేరులతో మండ పంలో అధిష్టింపజేశారు. నిత్య కళ్యాణములో పాల్గొన్న భక్తుల, గోత్రనామా లతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనా లతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశా సనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

## కీర్తిశేషులైన కార్పొరేటర్ బొమ్మిడి రమణ తండ్రికి.. నివాళులర్పించిన ఎంపీ భరత్, ఎమ్మెల్యే గణబాబు



**ఎన్ఏడి, పెన్ పవర్, సెప్టెంబర్ 9**

జీవీఎంసీ 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ తండ్రైన కీర్తిశేషులు బొమ్మిడి అప్పలనాయుడు స్వర్గస్తులైన సందర్భంగా జీవీఎంసీ స్కూల్ బుచ్చిరాజుపాలెం స్వగృహం నందు విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం శ్రీభరత్, విశాఖ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు గణబాబు విశాఖ జిల్లా ఆర్డిఓ ఉషన్, డిప్యూటీ జిఎన్ శ్రీధర్ ఇంటికొచ్చి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అప్పలనాయుడు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పల్ల శ్రీనివాసరావు, దాడి వెంకటరమేష్, గళ్ళ చిన్న, సరగడం రాజశేఖర్, బల్ల శ్రీనివాసరావు, గొలగాని పోలవరం, రాపర్తి కన్నా, సేనాపతి శంకరరావు, మొల్లి లక్ష్మణరావు, పిల్ల వెంకట్రావు, మద్దెల రాజశేఖర్, స్థానిక వార్డు అధ్యక్షులు ఎలమంచిలి ప్రసాదు, విశాఖ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు నరవ పైడిరాజు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని రక్షణ కై మొక్కలు నాటే కార్యక్రమం





**గాజువాక: పెన్ పవర్, సెప్టెంబర్ 09**

పర్యావరణాన్ని రక్షించుకోవడం మన బాధ్యత అని రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్నాథం అన్నారు. ఈ సందర్భంగా 87వ వార్డు లో శ్రీ నిలయం అపార్ట్మెంట్ 90ఫ్లాట్స్ వారి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం ఏర్పాటు చేయబడినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి, స్థానిక వార్డు కార్పొరేటర్ బోండా జగన్నాథం జగన్ పాల్గొని ముందుగా ముఖ్య అతిథి జగన్ చేతుల మీదుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత మనందరిదని, మొక్కల నాటడం వల్ల కాలుష్యం తగ్గుతుందని అన్నారు. ఈ కార్యక్రమం లో వార్డ్ అభవృద్ధి కమిటీ చైర్మన్ విజయరామరాజు,వర్రే రాంబాబు, పావడ రమణమూర్తి, కణితి ఈశ్వరరావు, ఆనంద్ కుమార్ ,వై. శ్రీనివాస్రావు, జాన్ రమేష్, కనకసత్యం ,దాలయ్య,కళ్యాణ్ చక్రవర్తి, రెడ్డి, గ్రామప్రజలు పాల్గొన్నారు.

## వరద రహదారులను పరిశీలించిన సీఐ



**అరకులోయ పెన్ పవర్ 9**

అరకులోయ మండలం సిరిగం పంచాయతీ తోట వలస రహదారి, రోడ్డు మార్గం కల్వర్టును పరిశీలించిన సిఐ హిమగిరి. అతి భారీ వర్షం కారణంగా అధికంగా వరద వచ్చి కల్వర్టును కొట్టుకుపోయినదని, సమాచారం తెలుసుకున్న సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్. హిమగిరి వెంటనే స్థానిక ఎమ్మార్వో కు సమాచారం అందించారు.తోటవలస గ్రామంలో సందర్శించి అక్కడ పరిశీలించి స్థానిక ప్రజలతో వరదల వల్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.పై నుండి ఎక్కువగా నీరు రావడం వల్ల కల్వర్టు పూర్తిగా ధ్వంసం అయిందని, ప్రజలు తోటవలస గ్రామంకు వెళ్లాలంటే ప్రమాదకరంగా ఉన్న కారణంగా అటు వెళ్లే ప్రజలకు కాల్వ దాటే ప్రజలకు అవగాహన కల్పించారు. కాల్వలో వరద ఎక్కువగా ఉన్న కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండి వరద తగ్గేవరకు కాల్వ దాట వద్దని స్థానిక ఎమ్మార్వోతో మాట్లాడి పోలీస్ సిబ్బందితో పోలీసు సహాయంతో తాడును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎల్, హిమగిరి, స్థానిక ఎమ్మార్వో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అభాగ్యులకు అండగా శ్రీ స్ఫూర్తి ఫౌండేషన్

## సూరిబాబు కుటుంబ సభ్యులకు భారీ ఆర్థిక సాయం





**పాయకరావుపేట పెన్ పవర్ సెప్టెంబర్ 10**

శ్రీ స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు నేమాల శ్రీనివాసరావు (యన్.ఎస్.ఆర్) అమ్మాయి స్ఫూర్తి నైనిత మొదటి పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన శ్రీ స్ఫూర్తి ఫౌండేషన్ సహాయనిధి బాక్సులలో దాతలు వేసిన అమౌంట్ మరియు ఏలేశ్వరం స్థానిక యువత ఆర్థిక సహకారంతో మొత్తం 25140/- రూపాయలను కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం సి.రాయవరం గ్రామంలో కొన్ని రోజులు క్రితం దుందుర్తి సూరిబాబు గారు ఇళ్లు అగ్ని ప్రమాదానికి గురైన విషయం గ్రామస్తుల సమాచారం మేరకు తెలుసుకుని, ఈ రోజు శ్రీ యువసేన బ్లడ్ బ్యాంకు %ఇ% శ్రీ యువసేన స్వచ్ఛంద సేవ సంఘం వ్యవస్థాపకులు డా. సతీష్ గారు పుట్టినరోజు సందర్భంగా శ్రీ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆ కుటుంబానికి 25140/- రూపాయలను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం గ్రామ యువత ఈపు రాము, ఇసరపు పోతురాజు, ఇసరపు శివ, కూరాకుల చంటి, దేవర రమణ, లోగేష్ వెంకటేష్, సామన శ్రీనివాస్, లక్ష్మణ్, వీరబాబు, పంచదార్ల శివ మరియు ఫౌండేషన్ సభ్యులు దుర్గాప్రసాద్, శ్రీను, నాగదుర్గాప్రసాద్ తదితరులు పాల్గున్నారు.

## నేడు కూడా అన్ని విద్యాసంస్థలకు సెలవు

### జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,గూడెం కొత్త వీధి,పెన్ పవర్,సెప్టెంబర్ 09:**



అల్లూరి సీతారామరాజు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున, మంగళవారం కూడా కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ఈ నెల 10వ తేది మంగళవారం అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలలకు, కళాశాలలకు, అంగన్వాడీ కేంద్రాలకు శెలవు దినముగా ప్రకటిస్తున్నట్లు తెలియజేశారు. ప్రైవేట్ విద్యాసంస్థలు కూడా విధిగా సెలవు ఇవ్వాలని, ఎటువంటి తరగతులు నిర్వహించరాదని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు సెలవును గమనించి పిల్లలను పాఠశాలకు పంపించరాదని సూచించారు.ఎట్టి పరిస్థితులలోనూ పిల్లలు, పెద్దలు వాగులు గడ్డలు దాటరాదని కలెక్టర్ సూచించారు.

## తాజంగి రిజర్వాయర్ ను పరిశీలించిన పాడేరుసబ్ కలెక్టర్

**చింతపల్లి సెప్టెంబర్ 9పెన్ పవర్ :**

పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ తాజాంగి రిజర్వాయర్ ను సోమవారం పరిశీలించారు. వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించి రహదారులను, గెడ్డలను పరిశీలించారు. రిజర్వాయర్ నుండి దిగువకు విడుదల చేస్తున్న నీటిని పరిశీలించారు. అదేవిధంగా బలబద్రపురం వంతెనను పరిశీలించారు.



# తాండవ రిజర్వాయర్ ను సందర్శించిన అయ్యన్న తనయుడు చింతకాయల రాజేష్...







**నాతవరం పెన్ పవర్ (సెప్టెంబర్ 09)**

భారీ వర్షాల కారణంగా తాండవ రిజర్వాయర్‌లో వరద నీరు పెరిగిందని తెలుసుకున్న స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తనయుడు చింతకాయల రాజేష్ సోమవారం తాండవ రిజర్వాయర్‌ను సందర్శించారు.ఈ సందర్భంగా తాండవ రిజర్వాయర్ డీఈ అనురాధను ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.డీఈ అనురాధ అందించిన వివరాల ప్రకారం, మధ్యాహ్నం 3 గంటలకు రిజర్వాయర్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి 7,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 380 అడుగులు కాగా, ప్రస్తుతం నీటిమట్టం ప్రమాదకర స్థాయైన 379.40 అడుగులకు చేరుకుంది.ఇప్పటికే నాలుగు గేట్లు ఎత్తి దిగువకు 8,500 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు ఆమె వెల్లడించారు. నీరు ప్రవహించే మార్గంలో గెడ్డలు కరగడం వల్ల తాండవ నది మరింత వేగంగా ప్రవహిస్తోందని,దీంతో దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అయితే, ప్రస్తుతం ఎటువంటి తీవ్రమైన ప్రమాదం లేదని స్పష్టం చేశారు. ఈ సందర్శనలో చింతకాయల రాజేష్‌తో పాటు నాతవరం మండల అధ్యక్షుడు నందిపల్లి రమణ, నాతవరం మండల తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రమాదకరమైన వాగు మరోవైపు గర్భిణీకి పురిటి నొప్పులు!

### అటు అంబులెన్స్ కి ఇటు జీపుకి మధ్య తాడు కట్టి గెడ్డ దాటింపు!

### సాహసం చేసిన మొండిగడ్డ గ్రామస్తులు సకాలంలో ఆసుపత్రికి తరలింపు.



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్ సెప్టెంబర్ 9**

అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలో గత రెండు రోజులుగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో భారీ ఎత్తున కుంభవృష్టి వర్షాలు కురుస్తున్నాయి.ఈ నేపథ్యంలో గూడెం కొత్తవీధి మండలం మొండిగెడ్డ గ్రామానికి చెందిన కందుల శాంతికి పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి.అయితే ఆ గ్రామానికి సమీపంలో ఉన్న జెర్రెల వంతెన వద్ద వాగు తీవ్ర ప్రమాదక స్థాయిలో ప్రవహిస్తుంది.వాగు దాటితే గాని గర్భిణీ స్త్రీని ఆరోగ్య కేంద్రానికి తీసుకు వెళ్ళడానికి కుదరదు.అయితే వాగు వైపు అంబులెన్స్ వచ్చి ఉన్న వాగు దాటించడానికి ఏమి చేయాలో తెలియని పరిస్థితి.అయితే గ్రామస్తులు అందరూ కలిసికట్టుగా అటువైపు అంబులెన్స్ కి ఇటువైపు జీపుకి తాడు కట్టి అతి కష్టం మీద గర్భిణీ స్త్రీ కందుల శాంతిని వాగు దాటించి చింతపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ లో తరలించారు. మారుమూల ప్రాంతంలో ప్రజలు సరైన బ్రిడ్జిలు లేక వాగులపై ప్రమాదకర పరిస్థితులలో ఎలా ప్రయాణం చేస్తున్నారో అన్నది ఈ సంఘటన బట్టి తెలుస్తుంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని మారుమూల ప్రాంతాలలో వాగులపై బ్రిడ్జిలు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## తెదేపా సీనియర్ నేతలు సీనియర్ నాయకుల కుటుంబాలను ఎందుకు పట్టించుకోవడం లేదు

### తెదేపా నాయకులు నాగభూషణం, పూర్ణచంద్రరావు, లక్ష్మణ్, ఆనందరావు.

**చింతపల్లి సెప్టెంబర్ 9 పెన్ పవర్**

సీనియర్ నాయకులు అని చెప్పుకునే తెదేపా నేతలు ఆ తరం నాయకులను, వారి కుటుంబాలను పార్టీ పరంగా ఆదుకోవడంలో ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ఆ పార్టీ అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం, మండల అధ్యక్ష ఉపాధ్యక్షులు కిల్లో పూర్ణచంద్రరావు, లక్ష్మణ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు లు అన్నారు సోమవారం వారు మాట్లాడుతూ రాష్ట్రమంతటా ఎన్డీఏ కూటమి లో తెలుగుదేశం తిరుగులేని విజయం నమోదు చేసుకుంటే మన్య ప్రాంతంలో నేతల మధ్య సమన్వయం లోపించి విజయం సాధించే సీటును వైకాపాకు అప్పగించడం జరిగిందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చిత్తశుద్ధిగా పనిచేసినప్పటికీ నేతల మధ్య సమన్వయ లోపం మన్య ప్రాంతంలో పాడేరు, అరకు స్థానాలపై తీవ్ర ప్రభావం చూపిందన్నారు. సీనియర్లు అనే అహం తోనే కొంతమంది పార్టీకి వెన్నుపోటు పొడిచారన్నారు. దాని వలన వారితోపాటు పార్టీ శ్రేణులంతా ఇబ్బంది పడే పరిస్థితి తలెత్తింది అన్నారు. ప్రతిసారి సీనియర్లమైన తమను పట్టించుకోవడంలేదని చెప్పుకునే నేతలు గడచిన నాలుగు దశాబ్దాలుగా పార్టీని నమ్ముకుని ఆ నేతల వద్ద పార్టీ బలోపేతానికై కృషిచేసిన ఆ తరం నాయకులను, వారి కుటుంబాలను ఎందుకు విస్మరించారన్నారు. చింతపల్లి, జీకే వీధి మండలాలలో పార్టీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీ బలోపేతానికి ఎనలేని కృషి చేసిన దివంగత షేక్ నాజర్ వల్లి, బౌడు రాజారావు, చిన్న రమమూర్తి, బేరా రామలింగం పడాల్, జీకే వీధి మండలానికి సంబంధించి పలాస కొండలరావు లకు పార్టీ పరగా ఎందుకు ఆదుకోలేకపోయారన్నారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించి దివంగతులైన ఆ నాయకుల కుటుంబాలను పరామర్శించడంలోనూ, వారికి న్యాయం చేయడంలోనూ, ఆ కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను అధినేత దృష్టికి తీసుకువెళ్లడంలోనూ ఈ నేతలు ఎందుకు చొరవ చూపడం లేదని వారు ప్రశ్నించారు.



గిరిజనేతరుడైన నాజర్ వల్లి సుమారు 36 ఏళ్ల పాటు ఆ పార్టీ బలోపేతానికి కృషి చేసిన విషయం తెలిసిన సీనియర్ నాయకులంతా ఆయనకు పార్టీ పరంగా ఎందుకు గృహం కల్పించలేకపోయారని వారు ప్రశ్నించారు. నిజాయితీకి మారుపేరుగా పనిచేసిన ఆయన 2022 మార్చి 7న తుది శ్వాస విడిచిన నాటి నుండి ఆ కుటుంబం అన్ని విధాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నా, పార్టీ సీనియర్లు ఎందుకు పట్టించుకోవడంలేదన్నారు. శిథిలావస్థకు చేరిన పూరిల్లు సైతం ప్రస్తుతం అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు కూలిపోయి నిలువ నీడ లేకుండా పోయిందని, ఈ విషయంలో సీనియర్లం అని చెప్పుకునే నేతలు ఆ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని, లేనిపక్షంలో అధినేత దృష్టికి తీసుకువెళ్లి తామే ఆ కుటుంబానికి గృహం ఏర్పాటుకు కృషి చేస్తామని అన్నారు.

# బహుభాషా ఉపాధ్యాయుల బకాయి వేతనాలు చెల్లించాలి

### ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనం చెల్లించాలని ఎంఈఓ కు వినతి పత్రం.

### -ఆదివాసి మాతృ బహుభాష ఉపాధ్యాయ సంఘం నాయకులు -వి.చంద్రయ్య, కే. కొండయ్య కే.వెంకటరమణ, కే ప్రకాష్ రావు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబర్ 09**

ప్రాథమిక స్థాయిలో అక్షరాస్యత, నైపుణ్యాల అభివృద్ధికి, పాఠశాల విద్యా వ్యవస్థకు అత్యంత ప్రాధాన్యమిస్తూ విశిష్టమైన సేవలు చేస్తున్న ఆదివాసి మాతృ బహు భాష ఉపాధ్యాయులకు బకాయి వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనాలు చెల్లించాలని ముంచంగిపుట్టు మండల విద్యాశాఖ అధికారి కే కృష్ణమూర్తికు వినతి పత్రం అందించిట్లు ఆదివాసి మాతృ బహుభాషా ఉపాధ్యాయ సంఘం నాయకులు వి చంద్రయ్య, కే కొండయ్య, పి వెంకటరమణ, కే ప్రకాష్ రావు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం వారు పాత్రికేయులతో మాట్లాడుతూ ఫిబ్రవరి నెలతోపాటు జూలై, ఆగస్టు మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని, బహుభాషా ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం చెల్లించాలని సోమవారం విద్యాశాఖ అధికారులకు వినతి పత్రాన్ని అందించినట్లు వారు పేర్కొన్నారు. ప్రాథమిక స్థాయిలో అక్షరాస్యత, సంఖ్య నైపుణ్యం, సార్వత్రిక సామర్థ్యాలను సాధించడం, పాఠశాల విద్య వ్యవస్థకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం మాతృభాష విద్య బోధనయొుక్క ప్రాముఖ్యత అన్నారు. విద్యార్థులకు మూడో తరగతి నాటికి ప్రాథమిక విద్య నైపుణ్యం అభివృద్ధి లక్ష్యంగా దేశవ్యాప్తంగా పదివేల పాఠశాలలను ఎంపిక చేస్తే అందులో ఆంధ్ర రాష్ట్రంలో 1454 పాఠశాలలో స్థానిక ఆదివాసి మాతృభాష విద్య బోధన కోసం రాష్ట్ర ప్రభుత్వం 1327 మందిని నియమించిందన్నారు. 2023 -24 విద్యా సంవత్సరంలో గౌరవ వేతనం 5000 రూపాయలతో ఆగస్టు ఒకటి నుండి ఫిబ్రవరి 29 వరకు బహుభాష ఉపాధ్యాయుల ద్వారా ప్రభుత్వం పాఠశాలలను నడిపిందన్నారు. రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నామని, ఉపాధ్యాయులు లేని పాఠశాలలను కూడ ఆదివాసి మాతృభాష విద్య బోధకులు నిర్వహిస్తున్నామన్నారు. నాడు పదవ తరగతి అర్హతతో స్థానిక యువతీ యువకులను ఐటిడిఏల ద్వారా నియమించారని, నేడు బిఈడి, డైట్ ట్రైనర్స్, డిగ్రీ తదితర ఉన్నత విద్యావంతులు బోధించడం వల్ల ప్రాథమిక విద్యలో నాణ్యత, నైపుణ్యత పెరిగిందన్నారు. బహుభాష ఉపాధ్యాయుల వల్లే పాఠశాలలలో డ్రాప్ అవుట్స్ తగ్గిందని, విద్యార్థులు ఉన్నత విద్య వైపు మొగ్గుచూపుతున్నారన్నారు. ఇంత విశిష్టమైన కృషి చేస్తున్న మాతృభాష ఆధారిత విద్యాబోధకులకు ఉద్యోగ భద్రత కల్పించి యధావిధిగా కొనసాగించాలని, బకాయి పడ్డ ఫిబ్రవరి, జూలై, ఆగస్టు నెలల వేతనాలతో పాటు కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కే ప్రకాష్ రావు, జి సావిత్రి, మాతృభాష యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## మృతి చెందిన వారి కుటుంబనికి 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

### చట్రాపల్లి గ్రామంలో సహాయక చర్యలు, నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలి

### ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ




**అరకులోయ పెన్ పవర్ 9**

అల్లూరి జిల్లా గూడెం కొత్త వీధి మండలం గాలికొండ పంచాయితీ చట్రాపల్లి గ్రామంలో భారీ వర్షానికి కొండ చర్యలు విరిగిపడి చట్రపల్లి గ్రామం కొట్టుకుపోయిందని, ఘటనలో కొర్ర కుమారి 20 మహిళా మృతి చెందగా మరో ముగ్గురు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారని మృతి చెందిన కొర్ర కుమారి కుటుంబానికి 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ నాయకులు చేశారు. చట్రాపల్లి గ్రామంలో సహాయక చర్యలు చేపటి, నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని ఇల్లు కోల్పోయిన ఆదివాసుల కుటుంబానికి ప్రభుత్వం కొత్త ఇల్లు మంజూరు చేయాలని అల్లూరి సజిల్లా కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. గాలికొండ పంచాయితీ చట్రాపల్లి గ్రామంలో సుమారు 30 ఆదివాసి కుటుంబాలు నివసిస్తున్నాయని కురుస్తున్న భారీ వర్షాలకు కొండ చర్యలూ విరిగిపడి గ్రామం కొట్టుకుపోయిందని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సురక్షిత ప్రాంతంలో మోడల్ కాలనీ నిర్మించి ఇవ్వాలని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలదేవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## నేడు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గూడెం కొత్తవీధి మండలంలో పర్యటన

### తుఫాన్ బాధితులకు పరామర్శించే అవకాశం

**గూడెం కొత్తవీధి పెన్ పవర్ సెప్టెంబర్ 9**



అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలో తుఫాన్ బాధిత గ్రామాలను రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మంగళవారం సందర్శించే అవకాశం ఉందని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ముక్కలి రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత రెండు మూడు రోజులుగా మండలంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రాణ ఆస్తి నష్టాలు సంభవించాయి. దీంతో స్పందించిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి మంగళవారం మండలానికి వచ్చి తుఫాన్ బాధిత ప్రాంతాలను,తుఫాన్ వలన నష్టపోయిన బాధితులను పరామర్శిస్తారని వెల్లడించారు.

## నేడు చట్రాపల్లి, సపర్ల గ్రామాల్లో పర్యటించనున్న ఎమ్మెల్యే

### క్షతగాత్రులను పరామర్శించనున్న విశ్వేశ్వర రాజు

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, సెప్టెంబర్ 9**

అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలో ఆదివారం అర్ధరాత్రి తాండవించిన ప్రకృతి విలయం వలన ప్రాణ ఆస్తి నష్టాలను కోల్పోయిన కుటుంబాలకు నేనున్నానంటూ భరోసానిచ్చేందుకు పాడేరు శాసనసభ్యులు మత్స్యరస విశ్వేశ్వర రాజు మంగళవారం చట్రాపల్లి, సపర్ల గ్రామాలలో పర్యటించనున్నారు. అంతేకాకుండా మండలంలో వివిధ ప్రాంతాల్లో ప్రాణ ఆస్తి నష్టాలు కోల్పోయిన ప్రాంతాలను పర్యటించి క్షతగాత్రులకు ధైర్యాన్ని చెప్పనున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు, వైసిపి ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నట్లు వైసిపి పార్టీ వర్గాలు తెలిపాయి.



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com

# మా గోడు వినండి

## పెన్ పవర్ వార్తకు స్పందించిన ఎమ్మెల్యే -అధికారులకు ఆదేశాలు


పెన్ పవర్

మా...గో(గూ)డు వినండి

నేతలు మారారు... మా తలరాతలు మారేనా....!

వానలకు తడిచి చలికి వణికి ఎండలకు ఎండి విగత జీవులుగా జీవిస్తున్నాం

మిగతా జీవితానికి గూడునివ్వండి

ఉన్న వీరి నివాసాలు వారికి కనిపించకపోవడం విచిత్రం.విశాఖ లొ 13వ వార్డు జై భీమ్ నగర్ లో ఓ డి ఏ నిధులతో నిర్మించిన మార్కెట్ షెడ్లలో వార్డుకు సంబంధించిన కొంతమంది నిరుపేదలు మార్కెట్ షెడ్లను నివాసాలుగా ఏర్పాటు చేసుకుని

epaperpenpower.in
09 Sep 2024 - Page 1





**విశాఖ తూర్పు పెన్ పవర్ సెప్టెంబర్ 9**
గత మూడు రోజులకు కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజాజీవనం అతలాకుతులమైంది. ప్రభుత్వం తీసుకున్న ముందస్తు జాగ్రత్త వలన ఆస్తి ప్రాణ నష్టం లేకుండా అధికారులు సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. నియోజకవర్గాల వారీగా శాసనసభ్యులు అధికారులతో ఎప్పటికప్పుడు వివరాలను తెలుసుకుంటూ ఇటు పార్టీల నాయకులతో చర్చిస్తూ వార్డుల వారిగా సమగ్ర విచారణ చర్పిస్తున్నారు. విశాఖ తూర్పు నియోజకవర్గం 13వ వార్డు లొ జై భీమ్ నగర్ లో గల మార్కెట్ షెడ్యూల్లో ఏళ్ల తరబడి కొన్ని కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. మా గోడు వినండి గూడు కల్పించండి అనే శీర్షిక పెన్ పవర్ వార్తను ప్రచురించింది. వార్దిక స్పందించిన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తక్షణం అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. వెంటనే స్పందించిన ఎమ్మార్వో జోనల్ కమిషనర్. ఏపీ డి ఇతర అధికారులు ఆ ప్రాంతంలో నివసిస్తున్న ప్రాంతాలను పరిశీలించి తక్షణం వారిని అక్కడనుండి అన్న క్యాంటీన్ వద్ద గల కమ్యూనిటీ హాల్లో వారికి ఆహారం త్రాగునీరు ఇతర వసతులు కల్పించారు. ఈ శిబిరం వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు కొనసాగుతుందని అధికారులు వారికి తెలియజేశారు. ఎమ్మెల్యే వెలగపూడి ఆదేశాలతో టిడిపి నాయకులు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ సన్యాసిరావు. వార్డు అధ్యక్షుడు పత్రకొండ ధర్మారావు. క్లస్టర్ ఇంచార్జ్ తురకపూడి బాలస్వామి. గాడి సత్యం గూడూరు గోవింద్. చిన్న అమ్ములు.తదితరులు పాల్గొన్నారు.

## పోతురాజుపుట్టులో నేలమట్టమైన ఇల్లు

### భార్య ముగ్గురు పిల్లలతో నిరాశ్రయులైన కుటుంబం

### నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలన్న బాధితుడు రాజు





**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబర్ 09**
గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు తన ఇల్లు నేలమట్టం అయిందని, ప్రభుత్వం ఆదుకోవాలని వండాల రాజు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాడు. మండలంలో గల పనసపుట్టు పంచాయితీ, పోతురాజుపుట్టు గ్రామానికి చెందిన వండాల రాజు (50) గృహము భారీ వర్షానికి నేలమట్టమయింది. సోమవారం పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల వల్ల సోమవారం మధ్యాహ్నం తాను నివాసం ఉంటున్న ఇల్లు గోడ కూలి నేలమట్టం అయిందని, దీంతో రేకులన్నీ ధ్వంసమైనట్టు ఆయన పేర్కొన్నాడు. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని, రేకులు, తన గృహంలో ఉన్న కొన్ని సామాగ్రిలు ధ్వంసం అయిందని, ఇంట్లో ఉన్న వస్త్రాలు, ధాన్యాలు తడిచి ముద్దాయని ఆవేదన వ్యక్తం చేశాడు. తాముంటున్న ఇల్లు కూలిపోవడంతో భార్య, ముగ్గురు పిల్లలతో ఎక్కడ తలదాచుకోవాలని, నిరాశ్రయులైన తన కుటుంబాన్ని సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని, నూతన గృహము మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు.

## నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

### ఘనంగా ప్రారంభమైన జెసిఐ వార్షికోత్సవాలు





**గంగవరం/ గోకవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 9:**
విద్యార్థులు విద్యార్థి స్థాయి నుండి నాయకత్వ లక్షణాలను పెంచుకోవాలని జెసిఐ జోన్ ప్రెసిడెంట్ జె ఎఫ్ పి సురేష్ గొంప పిలుపునిచ్చారు. గోకవరం మండలం కొత్తపల్లి లో గల ఆదర్శ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రాంగణంలో జె సి ఐ, కాకినాడ ఆదర్శ డైమండ్స్ ఆధ్వర్యంలో జెసిఐ వార్షికోత్సవాలు ఘనంగా సోమవారం ప్రారంభం అయ్యాయి. తొలి రోజు రోజు వార్షికోత్సవాలను కాలేజీ చైర్మన్ కనకరాజు, జె సిఐ సభ్యులతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జె ఎఫ్ డి ప్రవల్లిక, జె ఎఫ్ పి సంతోష్ మాట్లాడుతూ విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే జేసీఐ ముఖ్య ఉద్దేశ్యం అని అన్నారు . అనంతరం వృద్ధులకు నిత్యవసర ఆహార సామాగ్రిని పంపిణీ చేశారు. అలాగే ఆదర్శ కాలేజీ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు తల్లిదండ్రులకు, అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్య ,గురువులకు కృతజ్ఞత లేఖలను రాసి అందించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ త్రినాధరావు వైస్ ప్రిన్సిపాల్ సుజని కోఆర్డినేటర్ శ్రీనివాస్ హెచ్ ఎం సత్యనారాయణ, అధ్యాపక బృందం సంకీర్తన, భార్గవి, దీప్తి, వలస రెడ్డి, కామేష్, రామలక్ష్మి ,అనూష, గణేష్ ,స్వర్ణ ,విజయ్ కుమార్, డాక్టర్ పైడిరాజు విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## భారి వర్షాల వల్ల నష్టపోయిన పంటలు, ఆస్తి నష్టం జరిగిన కుటుంబాలకు తగిన ఆర్థిక సహాయం వెంటనే అందించాలి

### సి పి ఎం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి : పాంగి ధనుంజయ్





**చింతపల్లి సెప్టెంబర్ 9 పెన్ పవర్**
రాష్ట్రంలో అల్పపీడనం వాయుగుండంగా మారి అన్ని విధాల నష్టపోయిన మన్యం అల్లూరి జిల్లా గిరిజన ప్రజలకు ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిపిఎం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పాంగి ధనుంజయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం భారీ వర్షాల వల్ల చింతపల్లి మండలం పెదబరుడ పంచాయతీకి చెందిన మడిగుంట లోని నర్సీపట్నం చింతపల్లి ప్రధాన రహదారి లోని బ్రిడ్జి భారీ వరద ప్రభావంతో కొట్టుకుపోవడం తెలుసుకున్న ఆయన అక్కడకు వెళ్లి పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేస్తూ అల్లూరి జిల్లాలో తుఫాను ప్రభావం వల్ల ఎడతెరిపి లేని భారీ వర్షాలతో అనేక ప్రాంతాలో చిన్న కలవర్టుల దగ్గర నుంచి బ్రిడ్జ్ ల వరకు వరద ప్రభావంతో కొట్టుకుపోయాయని వాటి నిర్మాణం కోసం తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు అంతేకాకుండా అటు జీకే వీధి మండలంలోని చింతపల్లి మండలంలోని చౌడు పెల్లి పంచాయితీకి చెందిన సత్యవరం గ్రామంలోని గెమ్మెలి పండన్న ఇల్లు కూలిపోయి ఆరు సంవత్సరాల బాలుడు పైగోడ పడి తీవ్ర అస్వస్థతకు గురి అయితే హాస్పటల్ పాలైన సంగతి తెలిసిందేనని అటు జీకే వీధి మండలంలో ఇల్లు కూలిపోయి మరణించిన సంగతి తెలిసిందేనని అన్నారు అందుకోసం ఇటువంటి సంఘటనలపై ప్రభుత్వం వెంటనే స్పందించి ఇల్లు కూలిపోయిన వారిని ప్రభుత్వం కొత్త ఇల్లు కట్టించి ఇవ్వాలని అలాగే ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ఒక్కొక్కరికి 50 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా భారీ వర్షాల వల్ల పంట పొలాలు కూడా ఎక్కువ మొత్తంలో దెబ్బతిని నష్టపోయాయని పంట నష్టపోయిన రైతులకు గుర్తించి తక్షణమే తగిన నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు అంతేకాకుండా భారీ వర్షాల వల్ల ప్రతికూల ప్రభావం కలిగిన వాతావరణం వల్ల గ్రామాల్లో జ్వరాలు ప్రబలుతున్నాయని దానికోసం ఎక్కడ ఎక్కడ మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని అవసరమైన సిబ్బందిని ప్రభుత్వం నియమించి అప్రమత్తంగా ఉండేలా చూసుకోవాలని డిమాండ్ చేశారు.

## జీకే వీధి మండలంలో పంట పొలాలకు అపార నష్టం!

### ఏడ తేరిపులేని వర్షాలకు నీట మునిగిన పంట పొలాలు





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, సెప్టెంబర్ 9**
అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలోని గత రెండు రోజులుగా కురిసిన కుంభ దృష్టి వర్షానికి మండలంలోని పలు గ్రామాలలో వాగు పరివాహక ప్రాంతాలలో వేసిన వరి పొలాలు పూర్తిగా నీట మునిగాయి.దీంతో ఈ పంట వేసిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వేసిన వరి పంట మొత్తం నీటమునిగి సర్వనాశనం అవ్వడంతో రైతులు ఇప్పుడు తమకి ఏమి దిక్కు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మండలంలోని పలు గ్రామాలలో ఈ పరిస్థితి నెలకొంది.ఇందులేదు అందులేదు అన్న విధంగా అన్ని గ్రామాలలోనూ రైతుల బాధ వర్ణనాతీతం పూర్తిస్థాయిలో వాగులు పొంగి ప్రవహించడంతో వాగు పరివాహక ప్రాంతాలలో వేసిన వరి పంట పూర్తి స్థాయిలో నీట మునిగి ఇసుక మేటలు వేసాయి.దీంతో ఏం చేయాలో తెలియని పరిస్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వలన పంట మొత్తం నీట మునిగి ఉండడంతో రైతుల ఆవేదన



గురి అవుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని సకాలంలో పంట నష్టపరిహారం అందించే విధంగా చూడాలని పలు గ్రామాల గిరిజనులు కోరుతున్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారి మధుసూదన్ రావు ఒక ప్రకటన విడుదల చేస్తూ పంట నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపించటం జరుగుతుందని రైతులు ధైర్యంగా ఉండాలని తెలిపారు.

## ముంచంగిపుట్టులో స్కూల్ రిలిటెడ్ జెండర్ బేషెడ్ వర్క్ షాప్

### పాఠశాలలలో లింగ వివక్షకు తావు లేదు.

### బాల బాలికలకు లింగ వివక్ష, బాల్యవివాహాలపై అవగహన కార్యక్రమం.

### సీమేట్ ఏపీ డైరెక్టర్ మస్తాన్ రావు.








**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబర్ 09.**
మండలంలోని పాఠశాలలలో విద్యార్థినులులకు ఎదురవుతున్న వివిధ సమస్యలపై వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం మండల కేంద్రంలో గల బాలికల పాఠశాల 01 లో సీమేట్ ఏపీ డైరెక్టర్ మస్తాన్ రావు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా పాఠశాలలలో విద్యార్థినులకు జరిగే లింగ వివక్ష, బాల్య వివాహాలు నిరోధించడానికి మండలంలో అన్ని పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులకు అవగహన కల్పించారు. చైల్డ్ ప్రోటాక్షన్ కమిటీలు ఇస్తున్నా ఫిర్యాదులపై స్పందన, వాటిపై తీసుకొను చర్యలపై కులంకుశంగా చర్చించడం జరిగింది. ఇట్టువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థినులకు మానసిక వికాసం, అభివృధి ఎంతగానో దోహదపడగలదని తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీ రావు, మండల విద్యాశాఖదికారీ కే కృష్ణమూర్తి, వక్తలు శారద, నాగమ్మ, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ ధోపా, జిసీడిఓ సూర్యకుమారి, సిఎంఓ జ్ఞనాప్రకాష్, ఏఎంఓ భాస్కర్ రావు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పిలు పాల్గొన్నారు.

# నీట మునిగిన సాకలిపేట

**పట్టించుకోని అధికారులు**

**కనీసం నీటిలోకి దిగని పేట రెవెన్యూ డిటి,ఆర్ఐలు**





**పాయకరావుపేట పెన్ పవర్ సెప్టెంబర్ 10**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తాండవ గేట్లు ఎత్తివేయడంతో లోతట్టు ప్రాంతమైన స్థానిక పాండురంగ స్వామి వెనుక గల సాకలిపేట నీట మునిగింది. ఈ మేరకు బాధితులు మాట్లాడుతూ అధికారులు ఎవరూ పట్టించుకోలేదని రెవెన్యూ అధికారులు డిప్యూటీ తాసిల్దార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ లు వచ్చి కనీసం నీటిలోకి కూడా దిగకుండా నీటిలో నుంచి తమను బయటకు రమ్మని మీకందరికీ సురక్షిత ప్రాంతం ఏర్పాటు చేసాం మీరందరూ ఉన్నఫలంగా వచ్చేయండని రాత్రి 8:30 గంటల సమయంలో చెబుతున్నారని వారు వాపోతున్నారు. తమకు బియ్యం ఇస్తాం అని మీరే వంట చేసు కొండి అని చెబుతున్నారన్నారు. అదేవిధంగా అడుగు తీసి అడుగే లేని పరిస్థితిలో మేము వంటలు ఎలా చేసుకుంటామని వారు ఎంతో బాధతో వినిపిస్తున్నారు. ఏది ఏమైనాప్పటికీ సంబంధించిన జిల్లా అధికారులు పట్టించుకుని తమన ఆదుకోవాలని వారు ఎంతగానో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# అధికారులను ఆదేశించిన రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత





**పాయకరావుపేట పెన్ పవర్ సెప్టెంబర్ 10**

బంగాళాఖాతంలో వాయుగుండం బలపడిన కారణంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తాండవ రిజర్వాయర్ వద్ద గేట్లు ఎత్తివేయడంతో లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులకు ఆదేశించమని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు 76 సంవత్సరాలు వచ్చిన విజయవాడలో వరద బాధితులను ఆదుకోవడంలో ముందున్న సంగతి అందరికీ తెలిసిందే ఆయనను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ వరద బాధితులకు సహాయం అందించాలని అదేవిధంగా స్థానిక పాండురంగస్వామి దేవస్థానం వెనకాల గల సాకలిపేట ను ఆమె సందర్శించారు ప్రతి ఒక్కరికి జాగ్రత్తగా ఉండాలని సూచించారు ప్రమాదం ఏదైనా వస్తే వెంటనే అధికారులకు తమకు ఫోన్ చేయాలని, దయచేసి అధికారులు ఎవరూ సెలవులు పెట్టొద్దని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పెద్దిరెడ్డి చిట్టిబాబు జనసేన పార్టీ ఇన్చార్జి గెడ్డం బుజ్జి, అధికారులు జనసేన,టిడిపి పార్టీ నాయకులు కార్యకర్తల అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గణనాథుని ఊరేగింపు



**పుల్లల చెరువు పెన్ పవర్ సెప్టెంబర్ 9**

పుల్లల చెరువు మండలం ఐటీ వరం గ్రామంలో వినాయక చవితి సందర్భంగా టీడిపి పార్టీ నాయకుల ఆధ్వర్యంలో వినాయకుని విగ్రహం ఏర్పాటుచేసి15 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఘనంగా ఊరేగింపును ఐటివరం మెయిన్ బజారులో నిర్వహించారు.అనంతరం 23కేజీల లడ్డు వేలం పాటలో 55 వేల రూపాయలకు గద్దె మూడోవ నరసయ్య పాడాడు.సోమవారం సాయంత్రం ఐటివరం ప్రధాన మెయిన్ బజార్లో కమ్మ పాలెం తదితర ప్రాంతాల్లో ఈ ఊరేగింపు సాగింది. వినాయకుని ఊరేగింపు అంగరంగ వైభవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎంపీటీసీ పోట్ల గోవింద్, టీడీపీ మండల నాయకులు,కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. అన్నదానం కార్యక్రమం భారీ ఎత్తు నిర్వహించారు. సాగర్ కాలువలో వినాయకుని విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు బయలుదేరి వెళ్తున్న సందర్భంగా గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు.

# గడ్డిబంధలో నేలకూలిన గృహం - తప్పిన పెను ప్రమాదం

**ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి -నూతన గృహము మంజూరు చేయాలి.**

**మండల వైస్ ఎంపీపీ సత్యనారాయణ, గిరిజన సంఘం నేత ఎం ఎం శ్రీను.**





**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబర్ 09**

ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలు జనజీవనాన్ని అస్తవ్యస్తం చేస్తుంది. ముంచంగిపుట్టు మండలం, కించాయిపుట్టు పంచాయతి, గడ్డిబంధ గ్రామానికి చెందిన గిరిజనుడు దడియా రమేష్ మట్టి ఇల్లు భారీ వర్షానికి ఆదివారం రాత్రి నేలమట్టమైనటు మండల వైస్ ఎంపీపీ పాటుబోయి సత్యనారాయణ, గిరిజన సంఘం నేత ఎంఎం శ్రీను తెలిపారు. సోమవారం వారు పాత్రికేయులతో మాట్లాడుతూ దడియ రమేష్ తన భార్య, ముగ్గురు పిల్లలతో నిద్రిస్తున్న సమయంలో మధ్య రాత్రి 2 గంటలకు ఒకేసారి ఇల్లు కూలి నేలమట్టమయ్యాయని, తృటిలో పెను ప్రమాదం తప్పిందని లేకుంటే భారీ నష్టం వాటిలి అవకాశం ఉండేదన్నారు. ఇల్లు కూలడంతో కుటుంబ సభ్యులందరూ తడిచి పోయినట్లు వారు పేర్కొన్నారు. ఈ విషయం విన్న వెంటనే సోమవారం గడ్డిబంధ గ్రామంలో వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించినట్లు వారు పేర్కొన్నారు. తక్షణ సహాయం కింద 50 కేజీల బియ్యము, పప్పు నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని, భారీ ఆస్తి నష్టం జరిగిందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి నష్టపరిహారం తో పాటు నూతన గృహము మంజూరు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# రాజకీయ చైతన్య గురువు తోటా నగేష్‌కు ఘన సత్కారం

**సర్వేపల్లి రాధాకృష్ణన్ మెమోరియల్ అవార్డు గ్రహీత -తోట నగేష్ ను సత్కరించుకోవడం మన బాధ్యత**

***మాజీ పాండురంగ దేవస్థానం చైర్మన్ యళ్ల వరహాల బాబు***





**పాయకరావుపేట పెన్ పవర్, సెప్టెంబర్ 10**

దేశ రాజధాని ఢిల్లీలో ఆదిలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజకీయ చైతన్య గురువు, రైతు పక్షపాతి, కరోనా వైరస్ టైం లో అందరినీ ఆదుకున్న ఘనుడు, ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించే చిరునవ్వు కలిగిన మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్, ప్రస్తుత జనసేన పార్టీ నాయకులు తోటా నగేష్ కు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆయన చేసిన మంచి పనులన్నీ గుర్తించి ఉపాధ్యాయ గురువు సర్వేపల్లి రాధాకృష్ణన్ మెమోరియల్ అవార్డును అందుకోవడం మన పాయకరావుపేట పేరును ఢిల్లీ రాజధానిలో మారుమోగించిన నాయకులు తోట నగేష్ ను సత్కారించుకోవడం మనందరి బాధ్యతని పాయకరావుపేట పాండురంగ స్వామి మాజీ చైర్మన్ యళ్ల వరహాల బాబు పేర్కొన్నారు. ఈ మేరకు నాయకులు వరహాల బాబు ఈరోజు తన బృందంతో కలిసి నాయకులు తోట నాగేష్ కు సాల్వతో సన్మానించి ప్రత్యేకమైన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆది, కరి శ్రీను, నామాల లక్ష్మణరావు, కొప్పుల రాజా రమేష్ గొంతిన అనిల్ బాబు, నల్లల రాజు తదితరులు పాల్గొన్నారు.

## తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు

# ప్రజలు అప్రమత్తంగా ఉండండి

**పాడేరు ఎమ్మెల్యే మత్స్యరస విశ్వేశ్వర రాజు**



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్ సెప్టెంబర్ 9**

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో తుఫాను ప్రభావంతో భారీ ఎత్తున గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అత్యవసరం అయితే తప్ప ఇండ్లను వదిలి బయటకు రావద్దని ఇటువంటి అత్యవసర పరిస్థితులు ఎదుర్కొన్న వెంటనే సమాచారం అందించాలని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు ప్రజలను కోరారు.తుఫాను ప్రభావం అధికంగా ఉండటం వలన అల్లూరి జిల్లా పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో భారీ ఎత్తున గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు పంట పొలాలు ఇండ్లు రహదారులు బ్రిడ్జిలు కల్వర్టులు వంటివి తీవ్రంగా నష్టం జరిగిందని దానిని సకాలంలో అధికార యంత్రాంగం చర్యలు తీసుకొని పునరుద్ధరించాలని ఆయన కోరారు.అల్లూరి జిల్లా గూడెం కొత్త వీధి మండలం గాలికొండ గ్రామపంచాయతీ చత్రాపల్లి గ్రామంలో కొండ చర్యలు విరిగిపడి ఆ ప్రాంతంలో భారీ ఎత్తున బీభత్సాన్ని సృష్టించాయని ఒకరు మృతి చెందగా మరో కొందరు తీవ్ర గాయాలు పాలవడం తీవ్ర బాధాకర విషయమని ఈ సంఘటన సమాచారం తెలిసిన వెంటనే ఆ ప్రాంతానికి వెళ్లడానికి ప్రయత్నించిన సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో వెళ్లలేక పోయామని అయినా ఆయా ప్రాంతాలకు వెళ్లి పూర్తిస్థాయి చర్యలు తీసుకునే విధంగా ప్రయత్నిస్తానని ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు అన్నారు.ఈ మేరకు గూడెం కొత్తవీధి మండలంలోని ముంపు ప్రాంతాలు మరియు చత్రా పెల్లి ప్రాంతాన్ని మంగళవారం పరిశీలించి తీసుకోవలసిన చర్యలు వెంటనే చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు.గిరిజన ప్రాంతంలో కనీవినీ ఎరగని రీతిలో ఎన్నడూ లేని విధంగా తీవ్ర పంట నష్టంతో పాటు పలు గ్రామాలలో ఇండ్లు కూలిపోయే గిరిజనులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని ఈ సంఘటనలో తనను తీవ్రంగా కలిసి వేస్తున్నాయని ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు తెలిపారు. పాడేరు నియోజకవర్గం లోని అన్ని మండలాల వైసిపి నాయకులు కార్యకర్తలు రంగంలోనికి దిగి ఆయా ప్రాంతాలలో తీసుకోవలసిన సహాయ చర్యల్లో పాల్గొనాలని ఆయన పార్టీ నాయకులకు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.గత రెండు రోజులకు కురిసిన భారీ వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురయ్యారని వారి సమస్యలు పరిష్కరించడానికి వైసిపి నాయకత్వం ముందుకు రావాలని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో జరిగిన నష్టాన్ని వెంటనే పరిశీలించి దానిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

# అన్న క్యాంటీన్‌కు రూ. 6 వేలు విరాళం

**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 9**

గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ని బెస్తవారిపేట మండలం, పందిళ్లపల్లె గ్రామానికి చెందిన కర్నాటి వెంకట నారాయణ రెడ్డి గిద్దలూరు పట్టణంలో ప్రారంభించనున్న అన్న క్యాంటీన్ నిర్వహణకు తన వంతు సహకారంగా ఆరు వేల రూపాయలను అందచేశారు. ఈ సందర్బంగా వారిని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆవుల శ్రీనివాస రెడ్డి, లక్ష్మి రెడ్డి, వీరారెడ్డి తదితరులు పాల్గోన్నారు.

# గ్యాస్ సిలిండర్ పేలి 2 లక్షల మేర ఆస్తి నష్టం

**కొనకనమిట్ల పెన్ పవర్ సెప్టెంబర్ 9**

గ్యాస్ సిలిండర్ పేలిన ఘటన కొనకనమిట్ల మండలంలో సోమవారం చోటుచేసుకుంది. ఈ ఘటన కాట్రగుంట పంచాయితీ పరిధిలోని ఓబుళరెడ్డి పల్లి గ్రామంలోని దుగ్గిరెడ్డి కొండారెడ్డి ఇంట్లో ప్రమాదవశాత్తూ గ్యాస్ సిలిండర్ పేలింది.ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని,ఇంట్లో ఉన్న సామగ్రి కాలిపోయాయని బాధితుడు తెలియచేశారు.ఈ ప్రమాదంలో సుమారు 2 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు తెలియచేశారు.దయచేసి తమను ప్రభుత్వం ఆదుకోవాలని భాదితులు కోరుతున్నారు.

# శిలాఫలకాలపై పెయింట్ పూసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

**సర్పంచ్ మరియు వైసీపీ నాయకుల డిమాండ్**



**పలమనేరు సెప్టెంబరు 09, (పెన్ పవర్):**

నియోజకవర్గములోని గంగవరం మండల కేంద్రం పరిధి నందున్న మారేడుపల్లె సచివాలయం ముందున్న శిలాఫలకాలపై అక్రమంగా పెయింట్ పూసిన వ్యక్తిపై కఠినచర్యలు తీసుకోవాలని సోమవారం పంచాయతీ సర్పంచ్ మరియు ఉపసర్పంచ్ తో బాటు వైసీపీనాయకులు డిమాండ్ చేశారు.ఈ మేరకు పంచాయతీ సర్పంచ్ చంద్రమ్మ మరియు ఉపసర్పంచ్ మంజునాథ్ రెడ్డితో బాటు వార్డుసభ్యులు కలిసి ఈ విషయంపై వినతిపత్రాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సూపరెండంట్ కు అందించారు. అనంతరం ఉపసర్పంచ్ మంజునాథ్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏది ఉన్నా శిలాఫలకంపై ఉన్న పేర్లను ఎటువంటి పరిస్థితులలో తొలగించే అరత ఎవరికీ లేదన్నారు. కానీ పంచాయతీకి చెందిన ఓ అధికార పార్టీ నాయకుడు నిబంధనలు అతిక్రమించి శిలాఫలకంపై పెయింట్ వేయడం సరికాదని, వెంటనే మండల అధికారులు చర్యలు తీసుకోవాలని,లేనిపక్షంలో జిల్లా అధికారులకు పిర్యాదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఇందులో పలువురు వైసీపీ నాయకులు కూడా పాల్గొన్నారు.

# తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

***చింతపల్లి మండల జనసేన అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు***

**చింతపల్లి సెప్టెంబర్ 9 పెన్ పవర్**

మూడు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల మూలంగా వందలాది ఎకరాలు నీట మునిగి దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని చింతపల్లి మండల జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాల కారణంగా అనేక చెరువులు, కుంటలు అలుగు పోయడం, వరద బీభత్సం వల్ల నాటు పెట్టిన వరి,పొలాలు కొట్టుకు పోవడంతో రైతులు తీవ్ర%ళి%గా నష్ట పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.తాజాగా కొత్తపాలెం పంచాయతీ కడశిల్ప గ్రామంలో పల్టాసింగి భవాని, కొర్ర నర్సమ్మ లా నివాస గృహాలు శిధిల వ్యవస్థకు చేరుకుంది, దీంతో వారు లబో ధిబోమంటున్నారు. ఇదే గాక తదితర పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు రెవిన్యూ, వ్యవసాయ అధికారులు వెంటనే





గ్రామాలలో పర్యటించి జరిగిన నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం చెల్లించాలని ఆయన కోరారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల మూలంగా వేలాది ఇండ్లు నేలమట్టం అయ్యాయని ఇండ్లు కూలిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడు తున్నారని, తక్షణమే ప్రభుత్వం వారిని





సహాయక కేంద్రాలకు తరలించాలని డిమాండ్ చేశారు.ఇల్లు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించి, వారికి ఎన్టీఆర్ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వి రామకృష్ణ, జనసేన యూత్ కార్యదర్శి మఠం శ్రీనివాస్, గోపినాయక హరిబాబు, వార్డు సభ్యుడు అనిల్ కుమార్ గ్రామస్తులు పాల్గొన్నారు.